


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 87 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 7 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 87 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 7 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా ప్రభుత్వం చేస్తుంది



హైదరాబాద్ పెన్ పవర్:చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో మాట్లాడుతుంటారని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సినీ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరపున ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నా సలహాలు, సూచనలు ఇస్తుంటారని, అందుకు ఆయనను అభినందిస్తున్నానని అన్నారు.తెలంగాణ

మిగతా2లో

- సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం దిల్ రాజు మాతో మాట్లాడుతుంటారు: మల్లు భట్టి విక్రమార్క
- సినీ రంగ అభివృద్ధిపై సలహాలు, సూచనలు ఇస్తుంటారన్న ఉప ముఖ్యమంత్రి
- గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు బాధ్యతాయుతంగా తీసుకున్నారని వ్యాఖ్య



## రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

- రెపో రేటును యథాతథంగా ఉంచిన ఆర్బీఐ
- 5.25 శాతంగా కొనసాగనున్న వడ్డీ రేటు
- ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్న ద్రవ్య పరపతి కమిటీ
- ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని వెల్లడి
- 'న్యూట్రల్' విధానానికే కట్టుబడిన రిజర్వ్ బ్యాంక్

మిగతా2లో



## కేసీఆర్ కు కిషన్ రెడ్డి దత్తపుత్రుడు

- కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నది ఆయనే
- వారిద్దరినీ కిషన్ రెడ్డి కాపాడుతున్నారని విమర్శలు
- కిషన్ రెడ్డి కల్వకుంట్ల కిషన్ రావుగా మారిపోయారని ఎద్దేవా
- అరవింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్ స్మార్ట్ సిటీ ఎందుకు కాలేదని ప్రశ్న

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ నేత కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.కేసీఆర్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడు ..కిషన్ రెడ్డి కల్వకుంట్ల కిషన్ రావుగా మారారని అన్నారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతా మన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. కేసీఆర్, హరీష్ రావును ఎప్పుడు అరెస్ట్ చేస్తారో కిషన్ రెడ్డి చెప్పాలన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి శూన్యం అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. నిజామాబాద్ లో రెండుసార్లు బీఆర్ ఎస్ గెలిచినా మురికికూపం చేశారని విమర్శించారు సీఎం రేవంత్ రెడ్డి. అర్వింద్ ను ఎంపీగా గెలిపిస్తే నిజామాబాద్ ను స్మార్ట్ సిటీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు సీఎం రేవంత్‌రెడ్డి. నిజామాబాద్ జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు

మిగతా2లో


## మున్సిపల్ ఎన్నికలు.. బీజేపీ మేనిఫెస్టో విడుదల

- తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా
- బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామన్న రామచందర్ రావు
- యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో బీజేపీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్‌లు అశోక్ పర్ణామి, రేఖా శర్మతో కలిసి 'వికసిత్ తెలంగాణ.. బీజేపీ సంకల్ప పత్రం' పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలిస్తే పెండింగ్ పనుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు

మిగతా2లో



## ఓడిపోయాక కోర్టుకొస్తారా?

ప్రశాంత్ కిశోర్ పార్టీ పిటిషన్‌పై సుప్రీం అసహనం

- ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- 2025 బీహార్ ఎన్నికలను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- ఎన్నికల వేళ మహిళలకు రూ.10,000 పంచడంపై పిటిషన్‌లో ఆరోపణలు
- ప్రజలు తిరస్కరించాక కోర్టుకు వస్తారా అంటూ ధర్మాసనం అసంతృప్తి
- పాట్నా హైకోర్టుకు వెళ్లాలని సూచన

మిగతా2లో

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 69 మంది మృతి



- మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మందికి గాయాలు
- నగరంలో ఎమర్జెన్సీని ప్రకటించినట్లు పోలీసు అధికారి వెల్లడి
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు
- ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో భారీ పేలుడు
- శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో జరిగిన దాడి
- ఇది ఆత్మాహుతి దాడి అని అనుమానిస్తున్న అధికారులు

హైదరాబాద్ పెన్ పవర్:ఆత్మాహుతి దాడి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధించింది. ఇస్లామాబాద్‌లోని షియా మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మంది గాయపడ్డారు. నగరంలోని షెహ్జాద్ టౌన్ ప్రాంతంలో గల షియా

మిగతా2లో



## గడ్చిరోలిలో భీకర ఎన్ కౌంటర్..

ఏడుగురు మావోయిస్టులు హతం..

### కీలక నేత ప్రభాకర్ మృతి

హైదరాబాద్ పెన్ పవర్: గడ్చిరోలి జిల్లాలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ భీకర ఎన్శ్రీకౌంటర్శ్రీలో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌లో కామారెడ్డికి చెందిన మావోయిస్టు కీలక నేత ప్రభాకర్ మృతి చెందాడు. మహారాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రభాకర్‌పై రూ.50 లక్షల రివార్డు ప్రకటించి ఉంది. ప్రభాకర్ గడ్చిరోలి డివిజనల్ కమిటీ హెడ్‌శ్రీగా ఉన్నాడు. ఈ ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు కూడా అమరుడయ్యాడు. మరొకరికి గాయాలయ్యాయి.

గడ్చిరోలికి, ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతానికి సమీపంలోని భమ్రాగడ్ తాలూకాలోని ఫోదేవాడ గ్రామం దగ్గర అడవిలో పోలీసులు, నక్సలైట్ల మధ్య మూడు రోజులుగా ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. ఈ ఎన్ కౌంటర్లో ఏడుగురు మావోలతో పాటు జవాన్ దీపక్ మాదవి అమరుడయ్యాడు.

మిగతా2లో

## కేసీఆర్ ను జాతిపిత అంటే ఒప్పుకోను



- జాతిపిత అనే బిరుదు ఎవరికి వారు పెట్టుకునేది కాదన్న కోదండరామ్
- ఉద్యమకారులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శ
- తెలంగాణ అస్థిత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి వాడుకోవడం దారుణమని వ్యాఖ్య

మిగతా2లో

## తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేయాల్సి ఉన్న పవన్
- ఎన్నికల ప్రచారం రద్దయినట్టు ప్రకటించిన జనసేన
- అనివార్య కారణాల వల్లే ప్రచారం రద్దయినట్టు సమాచారం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం రద్దయింది. ఇంతకు ముందు వెలువడిన ప్రకారం రేపు, ఎల్లుండి ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారం రద్దయినట్టు

మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# అసమానతల ప్రపంచంలో అభివృద్ధికి చోటెక్కడా?

‘సమాజం ఎంత అభివృద్ధి చెందితే, అసమానత అంత తగ్గాలి’ అనేది సాధారణ అంచనా. కానీ 21వ శతాబ్దపు ప్రపంచ వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అపూర్వంగా విస్తరించినప్పటికీ ఆదాయం, సంపద, అవకాశాలు, సాంకేతికత, రాజకీయ ప్రభావం ఇలా అన్ని రంగాల్లోనూ ధనికులు, పేదల మధ్య అంతరం విస్తరిస్తోంది.ఈ అసమానత కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఇది సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య స్థిరత్వం, మానవ గౌరవంతో ముడిపడిన మౌలిక సమస్య.. ఈ సమస్యలు తీరాలంటే ప్రపంచానికి మానవ గౌరవాన్ని నిలబెట్టే అభివృద్ధి నమూనా అవసరం..ప్రపంచ అసమానత తీవ్రతను గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. వరల్డ్ ఇన్ఈక్వాలిటీ రిపోర్ట్ ప్రకారం, ప్రపంచ జనాభాలోని 10 శాతం మంది, మొత్తం సంపదలో దాదాపు మూడు వంతులు కలిగి ఉన్నారు.. దిగువ 50 శాతం ప్రజల వద్ద స్వల్ప సంపద మాత్రమే ఉంది. ఇది మార్కెట్ శక్తుల సహజ ఫలితంగా కాకుండా, మూలధన ఆధారిత వ్యవస్థలు శ్రమ ఆధారిత ఆదాయాన్ని మించి వేగంగా పెరు గుతున్నదానికి సంకేతం.

థామస్ పికెట్టి పేర్కొన్నట్లుగా, మూలధన లాభాల వృద్ధి రేటు, ఆర్థిక వృద్ధి కంటే ఎక్కువగా ఉన్నంత కాలం అసమానత పెరుగుతూనే ఉంటుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో మూలధనం ప్రధాన శక్తిగా మారింది. భూమి, ఆస్తులు, పెట్టుబడులు కలిగినవారు తమ సంపదను తరతరాలుగా పెంచుకుంటున్నారు. ఇక ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం వంటివి అధిక నైపుణ్యం ఉన్నవారికి లాభం చేకూర్చగా, తక్కువ నైపుణ్యం ఉన్న కార్మికులను వ్యవస్థ నుంచి బయటకు నెట్టేస్తోంది. అనేక దేశాల్లో పన్ను విధానాలు అసమానతను తగ్గించడంలో విఫలమవుతున్నాయి. వినియోగ పన్నులు పేదల ఆదాయాన్ని కుదించగా, మూలధన లాభాలకు ఇచ్చే రాయితీలు ధనికులను మరింత బలపరుస్తున్నాయి. విద్య, ఆరోగ్యం వంటి మానవ మూలధన రంగాల్లో పెట్టుబడి లోపం సామాజిక అభివృద్ధిని పరిమితం చేస్తోంది.

పేదరికం చరిత్ర మానవ నాగరికత చరిత్రతో సమానంగా ఉండేంత పురాతనమైంది. వ్యవసాయం ప్రారంభమైన తర్వాత భూమి యాజమాన్యం కొద్దిమందిలోనే కేంద్రీకృతమైంది. సామంత విధానం, బానిస వ్యవస్థలు శ్రమ దోపిడీని వ్యవస్థీకృతం చేశాయి. పరిశ్రమల విప్లవం తరువాత ఉత్పత్తి పెరిగినా, లాభాలు మూలధన యజమానులకే చేరాయి. ఇక వలస పాలన దేశాల్లో స్థానిక ఆర్థిక వ్యవస్థలను నాశనం చేసి దీర్ఘకాలిక పేదరికానికి బీజం వేసింది. ఈ చారిత్రక కారణాలన్నీ కలిసి పేదరికాన్ని ఒక తాత్కాలిక సమస్యగా కాకుండా, వ్యవస్థాత్మక సమస్యగా మార్చాయి. పేదలు పేదరికం నుంచి బయటపడలేకపోవడానికి ప్రధాన కారణం అవకాశాలు లేకపోవడం. పేద కుటుంబాల్లో పుట్టినవారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక భద్రత లభించదు.. ఫలితంగా వారు తక్కువ ఆదాయ ఉపాధుల్లోనే పరిమితమవుతారు.. ఇది తరతరాలుగా కొనసాగుతూ ‘పేదరిక చక్రం’గా మారుతుంది. కులం, లింగం, ప్రాంతీయ వివక్షలు ఈ పరిస్థితిని మరింత బలపరుస్తున్నాయి. అనధికార రంగాల్లో పనిచేసే కోట్లాది మంది భీమా, పెన్షన్ వంటి రక్షణ లేకుండా జీవిస్తున్నారు. అప్పుల ఉచ్చు కూడా పేదరికం నుంచి బయటపడే మార్గాన్ని మూసేస్తోంది.

భారతదేశం ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. తీవ్రమైన పేదరికం తగ్గిన ప్పటికీ, గ్రామీణ, పట్టణ విభజన, వ్యవసాయంపై అధిక ఆధారపడటం, విద్యా నాణ్యతలో వ్యత్యాసాలు ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాలు, సంక్షేమ పథకాలు, ఆహార భద్రత పథకాల ద్వారా పేద రికాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలోని కొన్ని దేశాలు అసమానతను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. నార్డిక్ దేశాలు అధిక పన్నులు వసూలు చేసి, ఉచిత విద్య, ఆరోగ్య సేవలు అందిస్తూ సమాన అవకాశాలను కల్పి స్తున్నాయి. బ్రెజిల్ వంటి దేశాలు పేద కుటుంబాలకు షరతు లతో నగదు సహాయం అందిస్తూ మానవ మూలధనాన్ని బలపరిచాయి. ఈ అనుభవాలు నేర్పేది ఏమిటంటే, మార్కెట్ వృద్ధితో పాటు బలమైన ప్రభుత్వ జోక్యం అవసరం. ప్రగతిశీల పన్నులు, సామాజిక భద్రత, మానవ మూలధనంలో పెట్టుబడి ఇవన్నీ కలిసి పనిచేయాలి. ప్రపంచంలో పేదరికం తగ్గాలంటే మానవ గౌరవాన్ని నిలబెట్టే అభివృద్ధి నమూనా అవసరం. పెరుగుతున్న అసమానత ఆధునిక ప్రపంచానికి అతిపెద్ద ముప్పుల్లో ఒకటి.. ఇది కేవలం ఆర్థిక గణాంకాల సమస్య కాదు.. ఇది సామాజిక స్థిరత్వం, ప్రజాస్వామ్య విశ్వసనీయత, మానవ గౌరవానికి సంబంధించిన సమస్య. సరైన పన్ను విధానం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విస్తృత ఉపాధి అవకాశాలు, సమర్థవంతమైన సంక్షేమ వ్యవస్థలు అమలైతే అసమానతను తగ్గించవచ్చు. అభివృద్ధి కొద్దిమందికి మాత్రమే పరిమితమైతే అది నిజమైన అభివృద్ధి కాదు. సమానత్వం, న్యాయం, అవకాశాల సమాన పంపిణీతో కూడిన వృద్ధే సుస్థిరమైన అభివృద్ధి. అదే 21వ శతాబ్దపు నిజమైన విజయం.

# టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా ప్రభుత్వం చేస్తుంది

- మొదటి పేజి తరువాయి
గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టాలీవుడ్ ఎలాంటి సాయం కోరినా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా చేయాలనేది తమ ప్రభుత్వం సంకల్పమని అన్నారు. ఈ మేరకు బ్లూప్రింట్ సిద్ధం చేశామని తెలిపారు.సినిమా రంగం ద్వారా సామాజిక సందేశాలు ఇవ్వడంతో పాటు వాణిజ్య పరంగా లబ్ధి పొందవచ్చని అన్నారు. చిత్ర పరిశ్రమ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. పరిశ్రమకు ఎలాంటి అవసరం వచ్చినా చేస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రత్యేకంగా చెప్పమన్నారని తెలిపారు. వారు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉన్నందున వారి తరఫున చెబుతున్నానని అన్నారు. గద్దర్ అవార్డుల వేడుకను దిల్ రాజు ఓ బాధ్యతగా స్వీకరించారని అన్నారు.

## కేసీఆర్ ను జాతిపిత అంటే ఒప్పుకోను

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను తెలంగాణ జాతిపిత అంటే తాను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోనని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జాతిపిత అనే బిరుదు ఎవరికి వారు పెట్టుకునేది కాదని... అది ప్రజలు ఇవ్వాలని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ అస్థిత్వాన్ని వ్యక్తిగత లబ్ధికి వాడుకోవడం దారుణమని అన్నారు. మరోవైపు, ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన జయశంకర్ నిజమైన జాతిపిత అని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియా దేవత అని కొనియాడారు. కేసీఆర్ ఎవరికి జాతిపిత అని ప్రశ్నించారు. వేరే వాళ్ల ఫోన్లు దొంగచాటుగా వినేవాళ్లు జాతిపితలా? అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందిస్తూ... జాతిపిత అంటే ఏమిటో రేవంత్ కు తెలుసా? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ చరిత్ర కేసీఆర్ దని చెప్పారు. తెలంగాణ కోసం ఎప్పుడైనా కొట్లాడిన చరిత్ర రేవంత్ కు ఉందా? అని ఎద్దేవా చేశారు.

## కేసీఆర్ కు కిషన్ రెడ్డి దత్తపుత్రుడు

- మొదటి పేజి తరువాయి
శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ.600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## మున్సిపల్ ఎన్నికలు.. బీజేపీ మేనిఫెస్టో విడుదల

- మొదటి పేజి తరువాయి
చేస్తామని తెలిపారు. అవినీతిరహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని తెలిపారు. కబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు బీజేపీని చూసి భయపడుతున్నాయని అన్నారు. కేంద్రం తెలంగాణకు ఏమిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారని, ఏ జిల్లాకు ఎంతిచ్చామో కూడా చెబుతామని అన్నారు. మరి రేవంత్ రెడ్డి ఏమిచ్చారో చెబుతారా అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పోలీసులను తమ కార్యకర్తల్లా ఉపయోగించుకుంటోందని అన్నారు.

## ఓడిపోయాక కోర్టుకొస్తారా?

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన ‘జన్ సురాజ్‘ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసి, కొత్తగా పోలింగ్ నిర్వహించాలని కోరుతూ ఆ పార్టీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ, పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. జన్ సురాజ్ తరఫున సీనియర్ న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదనలు వినిపించారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ ‘ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన‘ కింద మహిళలకు రూ.10,000 చొప్పున పంపిణీ చేసిందని, ఇది ఓటర్లను ప్రలోభపెట్టడం, లంచం ఇవ్వడం కిందకే వస్తుందని ఆరోపించారు. తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న బీహార్‌లో ఇలాంటి పథకం ద్వారా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొన్నారు.

ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. “మీకు ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలు తిరస్కరించిన తర్వాత ఉపశమనం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారా?“ అని ఘాటుగా ప్రశ్నించింది. ఈ పథకంపై అభ్యంతరం ఉంటే సరైన సమయంలోనే సవాల్ చేయాల్సిందని అభిప్రాయపడింది. మొత్తం ఎన్నికల ప్రక్రియను రద్దు చేయాలని కోరడం సరికాదని వ్యాఖ్యానించింది.దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై దాఖలైన ఇతర పిటిషన్లపై విచారణను కొనసాగిస్తామని స్పష్టం చేసిన ధర్మాసనం, ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ వేసిన ఈ పిటిషన్‌ను మాత్రం విచారించలేమని తేల్చిచెప్పింది. పిటిషనర్ సదుద్దేశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది పాట్నా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి కోరగా, ధర్మాసనం అంగీకరించింది.

## హిందూపురంలో కాల్పుల కలకలం..

- మొదటి పేజి తరువాయి
నాగేంద్ర అనే రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లి, అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి వెళ్లగా, అతను వారిపై కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి తప్పించుకుని పారిపోతుండటంతో, ఆత్మరక్షణ కోసం సీఐ ఆంజనేయులు అతనిపై కాల్పులు జరిపినట్లు సమాచారం.నిందితుడు నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నాయి. గతంలో హిందూపురంలో అత్తాకోడళ్లపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసులో కూడా ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలాకాలంగా తప్పించుకు తిరుగుతున్న నాగేంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది. బుల్లెట్ గాయంతో పట్టుబడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం

రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు.

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.గత పాలకులు పోలవరాన్ని

గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గడ్చిరోలిలో భీకర ఎన్ కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు హతం.. కీలక నేత ప్రభాకర్ మృతి

- మొదటి పేజి తరువాయి
జవాన్ జోగా మాదవి గాయపడ్డాడు.
ఫిబ్రవరి 3న సాయంత్రం జ-60 స్క్వాడ్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, రాపిడ్ రెస్పాన్స్ టీం సిబ్బంది.. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ మొదలుపెట్టారు. అప్పటి నుంచి పోలీసులకు, నక్సలైట్లకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. పోలీసులు 3ాఖ 47లు, ఒక ూా= రైఫిల్, ఒక 303 గన్‌శ్రీను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నక్సలైట్లను గుర్తించే పనిలో ఉన్నారు.

## రుణ గ్రహీతలకు ఊరట.. కీలక వడ్డీ రేట్లు యథాతథం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. పాలసీ రెపో రేటును ప్రస్తుతమున్న 5.25 శాతం వద్దే కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో పాటు తమ ‘న్యూట్రల్ మానిటరీ పాలసీ‘ వైఖరికే కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. గత డిసెంబర్ సమావేశం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు పెరిగినప్పటికీ, ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే, వృద్ధికి ఆటంకం కలగకుండా సమతౌల్యం పాటించడమే ‘న్యూట్రల్‘ వైఖరి ఉద్దేశమని వివరించారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, ఆర్బీఐ నిర్దేశించిన సహన పరిమితి కంటే తక్కువగా ఉందని మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలకు సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 4 శాతం, 4.2 శాతానికి సవరించినట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయని, దేశీయ అంశాలే దీనికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. గత డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో వృద్ధిని ప్రోత్సహించేందుకు ఆర్బీఐ రెపో రేటును 5.5 శాతం నుంచి 5.25 శాతానికి (25 బేసిస్ పాయింట్లు) తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆగస్టు, అక్టోబర్‌లలో రేట్లను స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం రేట్లలో మార్పు లేనందున గృహ, వాహన రుణాలతో సహా ఇతర రుణాలపై వడ్డీ రేట్లు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదు.

## తెలంగాణలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం రద్దు!

- మొదటి పేజి తరువాయి
జనసేన ప్రకటించింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, పవన్ వ్యక్తిగత కారణాల వల్లే ప్రచారం రద్దయినట్లు సమాచారం. మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో ఈ ఉదయం పవన్ భేటీ అయిన సంగతి తెలిసిందే. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల గురించి వారితో పవన్ చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇంచార్జి శంకర్ గౌడ్, రాజలింగం, సాగర్ (ఆర్కే నాయుడు) తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 69 మంది మృతి

- మొదటి పేజి తరువాయి
మసీదు ప్రధాన ద్వారం వద్ద పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల సమీపంలోని భవనాలు, కిటికీలు కూడా పగిలిపోయాయి.పేలుడు అనంతరం నగరంలో నగరవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రకటించినట్లు ఇస్లామాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారిని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పాలీక్లినిక్ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, పలువురు మృతి చెందారని అన్నారు. ఆత్మాహుతి దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



దూలపల్లి- గుండ్ల పోచంపల్లి పరిధిలోని "సుమారు కుంట చెరువు" కబ్జా శాటిలైట్ చిత్రం..



చెరువు ఆక్రమణ జూమ్ చేసి, దగ్గరగా..

# చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాలపై..!

# హైడ్రా ఉక్కుపాదం..!

## దూలపల్లి "సుమారు చెరువు"లో ఆక్రమణలు 'హైడ్రా' కూల్చివేతలు..

- "సుమారు కుంట చెరువు" విస్తీర్ణం మొత్తం సుమారు 42 ఎకరాలు..
- ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు 11 ఎకరాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించిన హైడ్రా..
- స్క్రాప్ దుకాణాలు, హోటల్ షెడ్లు, కంటైనర్‌లో వెల్డింగ్ యూనిట్లను కూల్చివేత..
- శిఖం పట్టా భూముల పేరుతో మట్టి నింపడం, ప్రహరీలు నిర్మించడం..
- నిబంధనల ఉల్లంఘనగా గుర్తించిన హైడ్రా అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు..
- వర్షాకాల ముంపు ప్రమాదాల నివారణలో భాగంగా కఠిన చర్యలు చేపట్టిన హైడ్రా..

**దుండిగల్-గండిమైసమ్మ మండలం దూలపల్లిలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు బుల్డోజర్‌లతో శుక్రవారం భారీగా కూల్చివేతలు చేపట్టారు.. దాదాపు 42 ఎకరాల చెరువులో, 11 ఎకరాల మేరకు అక్రమ నిర్మాణాలను హైడ్రా పూర్తిగా తొలగించింది.. శిఖం పట్టా పేరుతో మట్టి నింపడం, ప్రహరీలు కట్టడం, షెడ్లు,వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేయడం నిబంధనల ఉల్లంఘనగా తేలింది.. వర్షాకాలంలో ముంపు ముప్పు పెరిగే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇకపై ఎలాంటి శాశ్వత నిర్మాణాలు సహించబోమని హైడ్రా హెచ్చరించింది..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 6:**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌గండిమైసమ్మ మండలం దూలపల్లి గ్రామంలోని "సుమారు కుంట చెరువు" ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపించారు.. శుక్రవారం ఉదయం హైడ్రా ఆధ్వర్యంలో భారీగా చర్యలు చేపట్టారు.. చెరువు విస్తీర్ణం సుమారు 42 ఎకరాలు ఉండగా, అందులో దాదాపు 11 ఎకరాల్లో ఆక్రమణలను గుర్తించిన హైడ్రా జేసిబిలతో కూల్చేశారు.. శిఖం పట్టా పేరుతో ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో మట్టి నింపడం, ప్రహరీలు నిర్మించడం, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడం వంటి పనులు నిబంధనలకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు..

చెరువు నీటి ప్రవాహ మార్గాలు దెబ్బతింటే వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని..! ముందస్తుగా ఈ చర్యలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. స్క్రాప్ దుకాణాలు, హోటల్ షెడ్లు, కంటైనర్ తయారీ యూనిట్లు, వెల్డింగ్ షాపులు వంటి వాణిజ్య కార్యకలాపాలు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో నడపడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు..



దూలపల్లి సుమారు చెరువు కబ్జాలో నిర్మాణం కూల్చివేత..




దుండిగల్ మండలం దూలపల్లి సుమారు చెరువులో, కబ్జాలపై హైడ్రా కూల్చివేతలు..

**చెరువులు, కుంటలు, గొలుసుకట్టు కాలువల, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు అనుమతించబోమని హైడ్రా అధికారులు హెచ్చరించారు.. నీళ్లు లేనప్పుడు మాత్రమే, శిఖం పట్టా భూముల్లో వ్యవసాయం మాత్రమే చేయవచ్చని, ఇతర వినియోగాల(నిర్మాణ సంబంధిత)కు పాల్పడితే..! కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.. గత కొంతకాలంగా "దూలపల్లి- గుండ్ల పోచంపల్లి గ్రామాల నడుమ ఉన్న ఈ "సుమారు చెరువు"లో కొనసాగుతున్న ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, హైడ్రా ఈ చర్యలు తీసుకున్నట్లు హైడ్రా అధికారులు పేర్కొన్నారు.. ఇకపై చెరువు రక్షణ కోసం పర్యవేక్షణ మరింత కఠినతరం చేస్తామని అధికారులు వెల్లడించారు.**

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

- సిగాచీ పరిశ్రమ మృతుల కుటుంబాలకు రూపాయి పరిహారం ఇవ్వలేదన్న హరీశ్ రావు
- రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు
- సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షలు ఇచ్చిందన్న మాజీ మంత్రి

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..

## తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు తుది గడువు

- ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌కు చివరి అవకాశం
- నిర్ణయం తీసుకునేందుకు మూడు వారాల గడువు
- గడువులోగా తేల్చకుంటే కోర్టు ధిక్కరణేనని హెచ్చరిక
- బీఆర్ఎస్ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు చివరి అవకాశమిచ్చింది. ఈ అంశంపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన గడువు విధించింది. నిర్ణీత గడువులోగా నిర్ణయం ప్రకటించకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం

-4 లో



## పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం

- కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' తరహా పథకం తెస్తున్నామన్న సీతక్క
- సర్వే చేయించి పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామన్న మంత్రి
- ప్రతి పేద కుటుంబానికి సాయం అందిస్తామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. కేరళలో అమలు చేస్తున్న 'కుటుంబశ్రీ' మోడల్ ను అనుసరించి ఈ పథకానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. కేరళలో ఒక సర్వే నిర్వహించారని... దాని ద్వారా 65 వేల మంది పేదలను గుర్తించి,




-4 లో

### రేవంత్ 'తిట్ల ట్రాప్'లో

# పడొద్దు..

## అసలు సమస్యలపై పోరాడండి

- వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్ తిట్ల పురాణం అంటూ కేటీఆర్ ఫైర్
- రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో బీఆర్ఎస్ శ్రేణులు చిక్కుకోవద్దని హితవు
- ఆరు గ్యారెంటీలు, రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలనే ప్రధాన అజెండాగా మార్చాలని సూచన
- తెలంగాణ నీటి వాటాలను రేవంత్ పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఆయన పన్నుతున్న 'తిట్ల ట్రాప్'లో పార్టీ శ్రేణులు చిక్కుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రజల అసలు సమస్యల నుంచి చర్చను పక్కదోవ పట్టించేందుకే రేవంత్ రెడ్డి దూషణల పర్వాన్ని ఎంచుకున్నారని

-4 లో

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్



**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు ఈ ప్రభుత్వం రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. బాధిత కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షల చొప్పున ఇచ్చిందని అన్నారు.సిగాచీ కంపెనీలో 54 మంది ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. హామీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి పురుషుల బస్సు ఛార్జీలను రెండింతలు చేశారని ఆరోపించారు.రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, తాను మంత్రిగా వస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బులు పంపిణీ చేస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డివి వట్టి మాటలేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని ధ్వజమెత్తారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..
# తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు తుది గడువు

-3 పేజి తరువాయి
విచారణ జరిపింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని గత విచారణలో వ్యాఖ్యానించిన కోర్టు, ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టుకు తెలిపారు. ఒక ఎమ్మెల్యే పిటిషన్‌పై విచారణ పూర్తయిందని, మరో ఇద్దరిపై ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం తీసుకోవడానికి మరింత సమయం కావాలని ఆయన కోరారు.ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, తుది అవకాశంగా మూడు వారాల గడువు మంజూరు చేసింది. ఈ గడువు తర్వాత తదుపరి విచారణ జరుపుతామని పేర్కొంటూ, కేసును మూడు వారాలకు వాయిదా వేసింది.

# పేదరిక నిర్మూలనకు సరికొత్త పథకం తీసుకొస్తున్నాం

-3 పేజి తరువాయి
వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారని సీతక్క తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సర్వే చేయించి, పేదరికంలో ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి తగిన సాయం అందిస్తామని సీతక్క తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడినా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

# రేవంత్ 'తిట్ల ట్రాప్'లో పడొద్దు..

-3 పేజి తరువాయి
ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు ఆయన ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు.

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాల అమలు వంటి మౌలిక వసతులపై చర్చ జరగాల్సి ఉండగా, సీఎం రేవంత్ తన 'బూతు పురాణం'తో చర్చను నీరుగారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్‌పై చేస్తున్న దాడిని తెలంగాణ పోరాట చరిత్రపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. "పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన శిల్పి కేసీఆర్. ఆయన ఏనాడూ బిరుదుల కోసం పాకులాడలేదు. ప్రజల సంక్షేమమే ఆయనకు అసలైన సత్కారం" అని కేటీఆర్ పేర్కొన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని, ఈ నమ్మకద్రోహంపైనే మన పోరాటం ఉండాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "ఎరువుల కోసం క్యూలైన్లలో నిలబడిన రైతుల కష్టాలు, రైతు భరోసా అందక వడ్డీ వ్యాపారుల చేతిలో నలిగిపోతున్న అన్నదాతల ఆవేదనపై ప్రభుత్వాన్ని నిలదీయండి. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, గురుకులాల్లో విషాహారంతో చిన్నారులు పడుతున్న బాధలకు బాధ్యులెవరని గల్లా పట్టి అడగండి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. డీఏలు, పీఆర్సీ ఊసే లేక ఉద్యోగులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక వృద్ధులు పడుతున్న మనోవేదనకు బీఆర్ఎస్ గొంతుకగా నిలవాలని ఆయన సూచించారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణ నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఒక 'కోవర్టు'లా వ్యవహరిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. ఇది తెలంగాణకు పట్టిన గ్రహణ కాలమని, ఈ చీకటిని తరిమికొట్టే బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

# పెద్ద నాయకులు పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉంది:
# బీఆర్ఎస్ నేతలపై కవిత సంచలన వ్యాఖ్యలు



- బీఆర్ఎస్ పార్టీకి బీసీలు ఓటు వేయాలో వద్దో నిర్ణయించుకోవాలని వ్యాఖ్య
- మున్సిపల్ ఎన్నికల్లో కృష్ణార్జునులు ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్న
- వాళ్లు రాష్ట్రస్థాయి నేతలు కాదా అని నిలదీత
- తమ పార్టీ ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**పెద్ద నాయకులు బీఆర్ఎస్ పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై, ఆ పార్టీ ముఖ్య నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీల అంశంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలో వద్దో బీసీలే ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు.మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం ప్రముఖంగా కనిపించడం లేదని అన్నారు. ఆ పార్టీ నేతలు ఎవరూ కిందిస్థాయిలో క్రియాశీలకంగా లేరని విమర్శించారు. కృష్ణార్జునులు రాష్ట్రమంతా ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. వారిద్దరూ రాష్ట్రస్థాయిలో ప్రచారం చేయడం లేదంటే రాష్ట్రస్థాయి నాయకులు కానట్లే కదా అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ తన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు.
బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన మాధవరెడ్డికి ఆ పార్టీ టిక్కెట్ ఎలా కేటాయించిందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. బీసీ సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. అసంబద్ధంగా
మాట్లాడితే ప్రజలు ప్రశ్నిస్తారని అన్నారు.
తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని అన్నారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిడుతున్నారని అన్నారు. నేను కేసీఆర్‌కు మద్దతివ్వడం లేదని, మర్యాదపూర్వక వాతావరణం ఉండాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఆవిర్భావానికి మంచి ముహూర్తం కోసం చూస్తున్నామని కవిత వెల్లడించారు. పార్టీ ఏర్పాటు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు.

# వికారాబాద్ లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రచారం

**వికారాబాద్ పెన్ పవర్:**
వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి దొడ్ల జయప్రద ప్రతాపరెడ్డి ప్రచారంలో పాల్గొన్న గడ్డం స్పీకర్ ప్రసాద్ కుమార్ వికారాబాద్ మున్సిపల్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగర వేస్తాం అని ప్రజలే హామీ ఇస్తున్నారు. ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసే ప్రజా పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలకు కావలిసిన అన్ని సదుపాయాలు ముఖ్యంగా ఇండ్లు గానీ, కరెంటు, ఫ్రీ బస్సు మరియు వికారాబాద్ కు వందల కోట్ల నిధులు తీసుకొచ్చన ఏకైక నాయకుడు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాబట్టి వికారాబాద్ పట్టణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని
గెలిపించుకొని మరింత అభివృద్ధి దిశగా వెళ్దాము తెలిపారు. వికారాబాద్లో బి ఆర్ ఎస్, బీజేపీ రెండు కూడా మా కాంగ్రెస్ పార్టికి ప్రేమ పోటీ చేశలేని స్థితిలో ఉన్నాయని వారు తెలిపారు.

## ప్రశాంత్ రెడ్డి ఆలోచన భీమ్గల్ అభివృద్ధిపైనే:
## జయరాం శ్రీనివాస్ నాయక్

**బాల్కొండ, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అనుచరుడు జయరాం శ్రీనివాస్ నాయక్, అసెంబ్లీలో భీమ్గల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రశాంత్ రెడ్డి నిబద్ధతను కొనియాడారు. ప్రశాంత్ రెడ్డి ఆలోచన, ఆశయం ఎల్లప్పుడూ భీమ్గల్ అభివృద్ధిపైనే ఉంటుందని, అక్కడి ప్రజలంటే ఆయనకు ప్రాణమని నాయక్ పేర్కొన్నారు. భీమ్గల్ ప్రజలను మరింత అభివృద్ధి చేయాలనే తాపత్రయం ప్రశాంత్ రెడ్డికి ఉందని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మోసాల నుంచి భీమ్గల్ ను కాపాడుకొని, మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి పట్టణాన్ని మరింత సుందరీకరించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

## తలసేమియా బాలుడికి మేముసైతం
## ఎన్‌జీఓ ఆర్థిక సాయం

**నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌కు చెందిన ఫైజల్ అనే తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడి కుటుంబానికి మేముసైతం ఎన్‌జీఓ రూ.20,000 ఆర్థిక సహాయం అందించింది. బోన్ మ్యారో చికిత్సకు భారీగా నిధులు అవసరమని తెలియడంతో, హైదరాబాద్‌కు చెందిన సామాజిక సేవకురాలు హిమజా రెడ్డి సహకారంతో ఈ సహాయం అందజేసినట్లు సంస్థ చైర్మన్ డా. నవీన్ కుమార్ గైని తెలిపారు. ఫైజల్ కుటుంబసభ్యులు సంస్థకు, హిమజా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలియాబాద్ లో ఉద్రిక్తత..
## డీజే వైర్ల తొలగింపుపై ఆందోళన

**మేడ్చల్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్ గడి మలక్ పేటలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రచార రథం డీజే వైర్లను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తొలగించారంటూ కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగిందని కాంగ్రెస్ డీసీసీ ప్రెసిడెంట్ తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, అంజిరెడ్డి ఆరోపించారు.

## ఇబ్రహీంపట్నంలో మంచిరెడ్డి ప్రచారం:
## కారు గుర్తుకే ఓటేయాలని పిలుపు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 2,3,4,5 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, ఇంచార్జ్ నందికంటి శ్రీధర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేశారు. కారు గుర్తుకే ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉప్పల్ లో రోడ్డు ప్రమాదం...
## బస్సు కింద పడి యువకుడు మృతి

**ఉప్పల్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** శుక్రవారం ఉప్పల్ బస్టాండ్ సపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి బోడుప్పల్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి బస్సు కింద పడటంతో మహబూబాబాద్ జిల్లాకు చెందిన మహేష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బోడుప్పల్ లో ఉంటూ పార్ట్ మ్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది.

## క్యాబ్స్ బంద్: రవాణాశాఖ
## కార్యాలయం ముట్టడికి పిలుపు



**అంబర్‌పేట, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** ఫిబ్రవరి 7, 2026న అఖిల భారత క్యాబ్ సర్వీస్ బంద్ లో భాగంగా, తెలంగాణ రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ లోని రవాణాశాఖ కార్యాలయం వద్ద 'చలో రవాణాశాఖ కార్యాలయం' కార్యక్రమం నిర్వహించనున్నారు. అగ్రిగేటర్ చట్టాల పరిధిలో యాప్ ఆధారిత కంపెనీలు పనిచేయాలని, రవాణా శాఖ ధరలు నిర్ణయించాలని, వైట్ ప్లేట్ వాహనాలకు ప్రజారవాణా అనుమతి తొలగించాలని, 5 లక్షల ప్రమాద బీమా పునరుద్ధరించాలని, క్యాబ్స్ కు పార్కింగ్ స్థలాలు కేటాయించి చలాన్ల నుంచి విముక్తి కల్పించాలని, అగ్రిగేటర్ కంపెనీలు ధరలను సమయానుకూలంగా మార్చుకునే నిబంధనను తొలగించాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఫిబ్రవరి 7న జరిగే బంద్ లో డ్రైవర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ గా మారిన మంత్రి పొన్నం

**హుస్నాబాద్: పెన్ పవర్:** హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం రోజురోజుకీ మరింత ఊపందుకుంది.ప్రజల మధ్యకే వెళ్లి, వినూత్న శైలిలో ప్రచారం నిర్వహిస్తూ రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపారు మంత్రి పొన్నం ప్రభాకర్.అధికార హోదాను పక్కనబెట్టి స్వయంగా ఆటో డ్రైవర్గా మారి ప్రచారం చేయడం ఇప్పుడు హుస్నాబాద్లో హాట్ టాపిక్గా మారింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలనే లక్ష్యంతో చేసిన ఈ ప్రచారం పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో అపూర్వ ఉత్సాహాన్ని నింపుతోంది.
పెద్దమ్మ ఆలయం నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు హుస్నాబాద్ వీధుల్లో వినూత్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా స్వయంగా ఆటో నడిపారు మంత్రి పొన్నం ప్రభాకర్.ప్రజలతో నేరుగా పలకరిస్తూ ఇంటి ఇంటికీ కాంగ్రెస్ సందేశాన్ని తీసుకెళ్లారు.
ప్రచారంలో
భాగంగా స్థానిక సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు మంత్రి పొన్నం ప్రభాకర్.మంత్రి ఆటో నడపడం చూసిన ప్రజలు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ మద్దతు తెలిపారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రజల సహకారంతో దుబ్బాకను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తా

**దుబ్బాక, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రజల సహకారంతో దుబ్బాకను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 4, 5 వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన, రాబోయే కాలంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంగా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలంతా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో అందరం భాగస్వాములం: సర్పంచ్ శారద సురేష్ నాయక్

**వనపర్తి, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం చెన్నూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ శారద సురేష్ నాయక్ అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఉపాధి హా పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వనపర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి శారదా బ్రహ్మం ప్రచారానికి జనప్రభంజనం



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** శుక్రవారం వనపర్తిలోని శంకరగంజిలో 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శారదా బ్రహ్మం నిర్వహించిన ఇంటింటి ప్రచారం జనసంద్రంగా మారింది. కాంగ్రెస్ జెండాలతో నిండిన ఆ ప్రాంతంలో, శారదా బ్రహ్మం వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు "ఒక్కసారి అవకాశం ఇవ్వండి" అని ఆమె విజ్ఞప్తి చేశారు. మహిళగా, కౌన్సిలర్ అభ్యర్థిగా బాధ్యతాయుతమైన పాలన అందిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హా ఇచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం, వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి మద్దతుతో ఆమె ముందుకు సాగుతున్నారు. శంకరగంజిలో లభించిన స్పందనతో, మహిళా శక్తితో కాంగ్రెస్ విజయం సాధిస్తుందనే విశ్వాసం కార్యకర్తల్లో నెలకొంది.

## మంచి నాణ్యత చీరలు అందిస్తున్నాం: మంత్రి

**నల్లగొండ, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మంచి నాణ్యతతో కూడిన చీరలను ఆడబిడ్డలకు అందిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. గతంలో కేసీఆర్ బస్తాల్లో కొనుకొచ్చి ఇచ్చిన చీరల పరిస్థితి అందరికీ తెలుసునని ఆయన అన్నారు. ఏ కలర్ చీర బాగుంటుందో, ఏ డిజైన్ అయితే బాగుంటుందో అని కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్నామని, మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో వారికి పెద్దపీట వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## హుజూర్ నగర్ ముక్త్యాల బ్రాంచ్ లో గుర్తు తెలియని శవం కలకలం

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** హుజూర్ నగర్ ముక్త్యాల బ్రాంచ్ కాలువలో గుర్తు తెలియని శవం కలకలం రేపింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి, శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## లక్ష్యాలు నిర్దేశించుకొని చదవండి: జిల్లా ఎస్పీ

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం దోమలపల్లి ప్రభుత్వ పాఠశాల టెన్త్ విద్యార్థులకు పిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదివి అత్యుత్తమ మార్కులు సాధించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించి చదువుపై శ్రద్ధ పెట్టాలని, క్రీడల్లోనూ రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్సై సైదాబాబు, పిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు, హెడ్మాస్టర్ శ్రీనివాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం సభకు ధర్పల్లి నుంచి భారీగా తరలింపు

**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** ధర్పల్లి మండల కేంద్రం నుండి సీఎం సభకు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా నిజామాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, నిజామాబాద్ జిల్లాకు సీఎం చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఇందిరమ్మ చీరలు కట్టుకొని స్వచ్ఛందంగా సీఎం సభకు వెళ్లారు. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు ధర్పల్లి మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్రాజ్.

# శ్వేతపత్రం విడుదల చేయాలంటూ బండి సంజయ్ డిమాండ్

### కౌంటర్ ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు..

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతున్నాయి.ఎన్నికల ప్రచార వేదికగా మారిన కరీంనగర్‌లో రాజకీయ పార్టీల నేతల మాటలు తూటాలుగా మారాయి.అభివృద్ధి నిధులే అంశంగా బీజేపీకాంగ్రెస్ నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తాయి.కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న లెక్కలు పూర్తిగా అవాస్తవమని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు.గురువారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లాకు రూ.1,400 కోట్లు ఇచ్చిందన్న సీఎం ప్రకటన పెద్ద డ్రామా అంటూ విమర్శించారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జిల్లాకు నయాపైసా కూడా ఇవ్వలేదని ఆరోపించిన బండి సంజయ్‌డఅభివృద్ధి నిధుల కేటాయింపుపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాదు ఫోన్ ట్యాపింగ్, ఇతర కుంభకోణాలపై ఆధారాలున్నా కేసీఆర్ కుటుంబ సభ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు.ఇది కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య ఉన్న అంతర్గత అవగాహనకే నిదర్శనమని వ్యాఖ్యానించారు.

**మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ :**
కాంగ్రెస్‌ను ప్రశ్నించే ముందు బండి సంజయ్ తన ఎంపీ పదవీకాలంలో కరీంనగర్‌కు ఏం తీసుకొచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు.మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.1,400 కోట్ల నిధులపై విడుదల చేసిన శ్వేతపత్రం తమ అభివృద్ధి విజయానికి నిదర్శనమని తెలిపారు.అంతకుమించిన అభివృద్ధి పనులు చేపట్టామని స్పష్టం చేశారు.సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు సాక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు నిందితులను కాపాడుతున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**
బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఈ 26 నెలల పాలనలో ఏం చేసిందో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేసారు. నిన్న బహిరంగ సభలో చెప్పినట్టే, కాంగ్రెస్ చేసింది ఒక్కటే కొండను తొవ్వి ఎలుకను పట్టిందని అయన అన్నారు.
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఏమి చెప్తుందో చూడాలి. హైకోర్టు జడ్జీల ఫోన్లు, సినిమా హీరోయిన్ల ఫోన్లు, పత్రిక యజమానులు, పత్రిక రిపోర్టర్లు, రాజకీయ పార్టీ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారని అధికారికంగానే చెప్తున్నారు. చివరకు హైకోర్టు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బహిరంగంగా అంగీకరిస్తున్నారు. అంతేకాదు, కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేశారని చెప్తున్నారు. ఇది నేను చెప్పడం కాదు కేసీఆర్ కూతురే స్వయంగా చెప్పిన మాట. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేసేంత దుర్మార్గపు పాలన బిఆర్ఎస్ హయాంలో కొనసాగిందని అయన అన్నారు.
ఇంత తీవ్రమైన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో, ఎవరి ఆదేశాలతో ఈ పని జరిగిందో తెలంగాణ ప్రజలకు, వ్యవస్థకు అందరికీ తెలుసు. అయినా కూడా దీనిని ఒక సాధారణ పోలీస్ ఆఫీసర్ తప్పుగా చూపిస్తూ, నిజమైన నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.
ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండేళ్లుగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, చివరకు తీసుకున్న ఏకైక చర్య ఏమిటంటే ఒక అధికారిని డీఎస్పీ స్థాయి నుంచి సీఐగా డిమోట్ చేయడమే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ 26 నెలల్లో హైకోర్టులో పిటిషన్లు, దర్యాప్తుల పేరుతో సీరియల్స్ కొనసాగించినప్పటికీ, సాధించిన 'గొప్ప విజయం' ఇదొక్కటేనని ఎద్దేవా చేశారు.
ఇప్పటికే 26 నెలలు పూర్తయ్యాయి, అయినా ఫోన్ ట్యాపింగ్ వంటి తీవ్రమైన అంశంలో నిజమైన బాధ్యులపై ఎలాంటి కఠిన చర్యలు లేవు. దీనికి కారణం కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ మధ్య ఉన్న రాజకీయ అవగాహన ఒప్పందమేనని అన్నారు.



రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీఆర్ మధ్య ఢిల్లీ స్థాయిలో ఒప్పందం, అండర్స్టాండింగ్ కుదిరింది కాబట్టే ఈరోజు తెలంగాణలో ఎవరి మీదా చర్యలు ఉండవని, అందుకే ఈ రెండు పార్టీలూ వాస్తవానికి ఒకటే పార్టీలు అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.
పార్టీ ఫిరాయింపుల విషయంలో కూడా కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య తేడా లేదని అన్నారు. ఈరోజు మున్సిపల్ కౌన్సిలర్గా, వైస్ చైర్మన్గా, మున్సిపల్ చైర్మన్గా బిఆర్ఎస్ నుంచి గెలిచిన వారు చివరకు కాంగ్రెస్ పార్టీలోకే వెళ్తున్నారని పేర్కొన్నారు.
హైదరాబాద్లోని జిహెచ్ఎంసి లాంటి రాష్ట్ర రాజధానిలో కూడా, బిఆర్ఎస్ తరఫున గెలిచిన మేయరు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉదాహరణ ప్రజల ముందే ఉందని గుర్తు చేశారు. అందువల్ల తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలని, బిఆర్ఎస్కు ఎందుకు ఓటు వేయాలి? కాంగ్రెస్కు ఎందుకు ఓటు వేయాలి? ఈ రెండు పార్టీలూ ఒకటే అన్న సత్యాన్ని ప్రజలు గుర్తించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# భాగ్యనగరంలో రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్మెన్కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్మెన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు.
బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దొంగలు నగరం విడిచి వెళ్లకుండా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల జాబితాను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నగరంలో నేపాలీ గ్యాంగ్ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పని మనుషులు, వాచ్మెన్లను నియమించే సమయంలో వారి ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# మాంగళ్య మాల్ ను ప్రారంభించిన శ్రీలీల

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్మన్ఘాట్లో మాంగళ్య షాపింగ్ మాల్ తన 12 వ నూతన స్టోర్ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టోర్ ప్రారంభ కార్యక్రమంలో శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేసి మాంగళ్య షాపింగ్ మాల్ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం షాపింగ్ మాల్లోని పట్టు, ఫ్యాన్సీ చీరల విభాగాలు, మహిళలు, పురుషులు, పిల్లల కోసం ఏర్పాటు చేసిన వస్త్ర విభాగాలను పరిశీలించి సందడి చేశారు.
ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ అధునాతన డిజైన్లు, నాణ్యమైన వస్త్రాలతో మాంగళ్య షాపింగ్ మాల్ వినియోగదారుల మనసు గెలుచుకుంటోందని తెలిపారు. కర్మన్ఘాట్లో నూతన స్టోర్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ స్టోర్లో ఫ్యాన్సీ, కంచి, ధర్మవరం, ఉప్పాడ పట్టు చీరలతో పాటు ఆధునిక కలెక్షన్లు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ద
పండుగల సందర్భంగా అవసరమైన అన్ని రకాల వస్త్రాలు ఒకేచోట లభించడం మాంగళ్య ప్రత్యేకత అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పీఎన్ మూర్తి, కాసం నమశ్శివాయ మాట్లాడుతూడమాంగళ్య షాపింగ్ మాల్స్ వివిధ రాష్ట్రాలలో ఇప్పటి వరకు 29 స్టోర్స్ ఉన్నాయని అన్నారు.

## అభివృద్ధిని చూసు ఓటెయ్యండి

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి జిల్లా భువనగిరి లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని 6 - 7 - 18 వ వార్డులలో ఎమ్మెల్యే గడప గడప తిరుగుతూ ఓట్ల అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు... అభివృద్ధి కార్యక్రమాల పైన ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను
ప్రజలకు గుర్తు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం లో అమలు అవుతున్నటువంటి ప్రజాపాలన ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పుకొచ్చారు..

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ

**హైదరాబాద్ పెన్ పవర్:** లాల్ గాడి మలక్పేట్ టిఆర్ఎస్ అభ్యర్థి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టిఆర్ఎస్ కాంగ్రెస్ ఇరువర్గాల మధ్య హోరాహోరీగావాగ్వాదాలు కొనసాగాయి. మల్లారెడ్డి డౌన్ డౌన్... కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ పరస్పర నినాదాలు చేసుకున్నారు. ఇరువర్గాలను అదుపు చేయడంలో పోలీసులు విఫలం అయ్యారు.
మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తన అనుచరులతో అభ్యర్థి ఇంటికి చేరుకుని గేటు బయట బైఠాయించారు. బిఆర్ఎస్ అనుచరులపై కాంగ్రెస్ కార్యకర్తలు గొడ్డళ్ల తో దాడి చేసారు..

# పవన్ ప్రచారం ఓట్లు వచ్చేనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, పెన్ పవర్:**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేయడానికి పవన్ కళ్యాణ్ సిద్ధమవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ తో ప్రత్యేకంగా సమావేశం అయిన తెలంగాణ బీజేపీ చీఫ్‌రామచంద్రరావు, కిషన్ రెడ్డి ఆయనను ప్రచారానికి ఒప్పించారు. ఒక జాతీయ పార్టీగా ఉన్న బీజేపీ, పక్క రాష్ట్రపు నాయకుడిని .. అదీ కూడా పోటీలో ఉన్న పార్టీ నేతను ప్రచారానికి ఆహ్వానించడంపై రాజకీయ వర్గాలు భిన్నంగా స్పందిస్తున్నాయి. తెలంగాణ బీజేపీలో బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి వంటి బలమైన నేతలు ఉన్నప్పటికీ.. పవన్ కళ్యాణ్‌ను రంగంలోకి దించడం వెనుక ఆ పార్టీ సొంత నాయకత్వంపై నమ్మకంకోల్పోయిందా? లేక ఇదొక వ్యూహాత్మక అడుగా? అనే చర్చ మొదలైంది. పొరుగు రాష్ట్ర నాయకులపై ఆధారపడటం వల్ల స్థానిక నేతల ప్రాధాన్యత తగ్గుతుందనే వాదన వినిపిస్తోంది. సెలబ్రిటీ ప్రచారకులు ఓట్లను ఎంతవరకు ప్రభావితం చేస్తారనేది ఎప్పుడూ ఒక మిస్టరీగానే ఉంది. గతంలో అనేక ఎన్నికల్లో సినీ గ్లామర్ ఉన్న నేతలు ప్రచారం చేసినా, అవి ఓట్లుగా మారుతాయా అంటే కచ్చితమైన సమాధానం లేదు. పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే, ఆయనకు తెలంగాణలో యువతలో భారీ ఫాలోయింగ్ ఉంది. కానీ, ఆ ఫాలోయింగ్ బీజేపీ అభ్యర్థుల బాక్సుల్లో ఓట్లుగా మారుతుందా? లేక కేవలం సభలకు జనాలను రప్పించడానికే పరిమితమవుతుందా? అన్నది చూడాలి. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పవన్ మద్దతు బీజేపీకి కొంత ప్లస్ అయినప్పటికీ, అప్పట్లో ఉన్న పరిస్థితులు వేరు, ఇప్పుడున్న రాజకీయ సమీకరణాలు వేరు. తెలంగాణలో స్థానికత అనేది ఎప్పుడూ ఒక సున్నితమైన అంశం. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వంటి వారు ఇప్పటికే పవన్‌ను ఆంధ్ర నాయకుడు అని ముద్ర వేస్తూ విమర్శలు ఎక్కుపెట్టారు. పవన్ కళ్యాణ్ గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత చేసిన కొన్ని వ్యాఖ్యలను విపక్షాలు ఇప్పుడు అస్త్రాలుగా వాడుకుంటున్నాయి. ఇటీవల దిష్టి పేరుతో పవన్ చేసిన వ్యాఖ్యలనూ బయటకు తీస్తున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ రాజకీయాలను శాసించాలని చూడటం తెలంగాణ ఆత్మగౌరవానికి దెబ్బ అనే వాదనను కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. దీనిని ఎదుర్కోవడం బీజేపీ–జనసేనకి ఒక సవాలుగా మారనుంది. బీజేపీ వ్యూహం ప్రకారం.. నిజామాబాద్, వరంగల్ వంటి నగరాల్లో సెటిలర్ల ఓట్లు , యువత ఓట్లు కీలకం. ఈ వర్గాలను ఆకర్షించడంలో పవన్ కళ్యాణ్ ప్రభావం ఉంటుందని ఆ పార్టీ గట్టిగా నమ్ముతోంది. ఒక జాతీయ భావజాలం ఉన్నప్పుడు ప్రాంతీయ సరిహద్దులు అడ్డంకి కాదు అని బీజేపీ సమర్థించుకుంటోంది. అయినప్పటికీ, తెలంగాణ మట్టి వాసన తెలిసిన, ఇక్కడి సమస్యలపై పోరాడే సొంత నేత ప్రచారానికి నాయకత్వం వహిస్తే వచ్చే మైలేజ్ వేరుగా ఉంటుంది. కేవలం సెలబ్రిటీలపైనే ఆధారపడితే, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ డీలా పడే ప్రమాదం కూడా ఉంది. పవన్ కళ్యాణ్ ప్రచారం బీజేపీకి గ్లామర్ తీసుకురావచ్చు కానీ, అది కేవలం క్రౌడ్ పుల్లర్ గానే మిగిలిపోతుందా లేదా 'గేమ్ ఛేంజర్' గా మారుతుందా అనేది ఫలితాలే తేలుస్తాయి. రాజకీయాల్లో నేతలకు కావాల్సింది ప్రచారం కంటే ముఖ్యమైనది స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజలతో ఉన్న అనుబంధం. ఈ ఎన్నికలు అటు పవన్ కళ్యాణ్ క్రేజ్‌కు, ఇటు తెలంగాణ బీజేపీ నాయకత్వ పటిమకు ఒక అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తొందరపాటు నిర్ణయాలు తీసుకుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన మద్దతు తీసుకోవడం ఒక రకంగా గెలిచే మున్సిపాలిటీ ఫలితాలపై కూడా ఈ ప్రభావం చూపుతుందని అంటున్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు.



అలాగే బీజేపీతో పొత్తుతో ఉన్నారు. అంత వరకూ ఓకే. కానీ ఆయన ఇటీవల చేసిన కామెంట్స్ ను ఇప్పుడు ఇతర పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకునే అవకాశాలున్నాయి. పవన్ కళ్యాణ్ పార్టీ జనసేనకు తెలంగాణలో క్యాడర్ లేదు. ఓటు బ్యాంకు కూడా లేదు. సినిమా అభిమానం వేరు. పవన్ ను అభిమానించే యువకులు సయితం తెలంగాణలో ఏదో ఒక పార్టీ పట్ల సానుకూలతతో ఉంటారు. అందులో బీజేపీ కూడా ఉండొచ్చు.గా ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో పవన్ కళ్యాణ్ ఇక్కడి కొబ్బరి తోటలు
ఎండి పోవడానికి కారణం దిష్టి అని అన్నారు. రాష్ట్రం విడిపోవడానికి కోనసీమ పచ్చటి అందాలని, కోనసీమ కొబ్బరి చెట్లకు తెలంగాణ వారి దిష్టి తగిలిందన్న అర్థం వచ్చే రీతిలో వ్యాఖ్యానించారు. జనసేన, బీజేపీకి
మద్దతిస్తుందని, పవన్ కళ్యాణ్ ఈ నెల 7, 8 తేదీల్లో తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారని ప్రకటన వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో ఆ వీడియోలను వైరల్ చేస్తున్నారు. సాక్షాత్తూ పీసీసీ అధ్యక్షుడుమహేష్ కుమార్ గౌడ్ కూడా పవన్ అలాంటి వ్యాఖ్యలు చేసి ఇప్పుడు తెలంగాణ ప్రజల ఓట్ల కోసం రావడమేంటని అన్నారంటే మరొకసారి సెంటిమెంట్ ను రగిల్చే ప్రయత్నం చేసినట్లయింది. రాష్ట్రం విడిపోయినప్పుడు
తాను తిండి తినలేదని, నిద్రపోలేదన్న పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను కూడా ప్రత్యర్థులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. బీజేపీ తెలంగాణలో బలంగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికలలో ఎనిమిది స్థానాల్లో గెలిచింది. అలాంటి బీజేపీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ వచ్చి ప్రచారం చేస్తే మున్సిపల్ ఎన్నికల్లో నష్టం వాటిల్లకతప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. పట్టణాల్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ అంతగా ఉండదని భావించికమలం పార్టీ పవన్ ను రంగంలోకి దించినప్పటికీ సెంటిమెంట్ ను ప్రత్యర్థులు తీసుకెళితే తీవ్రంగా నష్టపోయే అవకాశముందన్న హెచ్చరికలు సొంత పార్టీ నేతల నుంచి వినిపిస్తుండటం విశేషం. బీజేపీ తన సొంతపంథాలోనే వెళితే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయని, ఇలా ఏపీకి చెందిన నేతల సహకారం తీసుకుంటే లబ్ది కంటే నష్టమే ఎక్కువని అంటున్నారు.

# యాసంగి పంటల నమోదుకు రైతులు సహకరించాలి



**పెద్దపల్లి పెన్ పవర్:**
యాసంగి పంటల నమోదుకు రైతులు సహకరించాలని ఏఈఓ వినయ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పెద్దపల్లి ఏఈఓ వినయ్ కుమార్ రైతులు సాగు చేసిన పంటల నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ నమోదు చేసుకుం టున్నారు. ఇందులో భాగంగా గత మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో నమోదు కార్యక్రమం పూర్తి చేసుకోగా శుక్రవారం పట్టణశీలోని చందపల్లి పాత గ్రామ పంచాయతీ బస్తీ దవాఖాన వద్ద రైతులతో సమావేశం నిర్వహించి, దీని వల్ల రైతులకు కలిగే లాభాలు వివరించారు. అలాగే మక్క పంట వేసిన రైతులు, పంట ను మార్చిన రైతులు ఇంకా ఎవరైనా నమోదు ఉంటే వచ్చి చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన రైతులతో కలిసి పంటల నమోదుకు వెళ్లారు.

### ముఖ్యమంత్రి ఉన్న సమయంలోకేసీఆర్

# ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు



**మెదక్ జిల్లా: పెన్ పవర్:** కాళేశ్వరం కాలువ ద్వారా బిఆర్ఎస్ లక్షల కోట్లు దోచుకుందంటూ మండిపడ్డారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.
మెదక్ జిల్లా రామాయంపేటలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రఘునందన్ రావు భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు ఎంపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సీటు గెలవలేదని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ భూమి విక్రయించి డబ్బులు దోచుకుంటుందని మండిపడ్డారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువును ఖర్చు చేసి అభివృద్ధి చేశారు రామాయణం దత్తత తీసుకొని మల్లెచెరువుకు 100 కోట్లు కూడా కేటాయించలేదు రామాయంపేట ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను బిఆర్ఎస్ నాయకులు బెదిరింపులకు గురిచేస్తే ఊరుకునే ఊరుకునే ప్రసక్తి లేదని మండిపడ్డారు పద్మాదేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి రామాయంపేట ను ఏలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు.

# పంటల రక్షణ పేరుతో విద్యుత్ ఫెన్సింగ్ ప్రాణాంతకం

### - విద్యుత్ ఎస్ ఈ గంగాధర్

**పెద్దపల్లి:పెన్ పవర్:**అడవి జంతువుల నుండి పంటల రక్షణ పేరుతో విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే ప్రాణాంతకమని ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ వేయవద్దని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ హెచ్చరించారు. అ డవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందు కు వరి పొలాలు, వ్యవసాయ భూముల చుట్టూ అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రమైన విద్యుత్ ప్రమాదాలు సంభవి స్తున్నాయని పెద్దపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్ తెలిపారు. ఈ ప్రమాదాల కారణంగా గతంలో అనేక చోట్ల రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే పశువులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లకు నేరుగా లేదా అనధికారికంగా వైర్లు అనుసంధానించి ఫెన్సింగ్ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అత్యంత ప్రమాదకరమైందని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ఈ ఫెన్సింగ్ మరింత ప్రమాద కరంగా మారి, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తెలియక తాకితే ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యుత్ ఫెన్సింగ్ కారణంగా మనుషులకే కాకుండా, ఆవులు, ఎద్దులు, మేకలు వంటి పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఎస్ఈ తెలిపారు. ఇది వారి కుటుంబాలకు తీరని నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్



ఏర్పాటు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ముఖ్యంగా సోలార్ ఆధారిత ఫెన్సింగ్, గార్డింగ్, ఇతర సురక్షిత వ్యవసాయ పద్ధతులను వినియోగించు కోవాలని ఆయన సూచించా రు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఫెన్సింగ్ ఉన్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ ఈ కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణ కు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు .

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**మధిర, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మణుగూరు గుట్ట మల్లారం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బాయి కూనవరంకు చెందిన ఏనీక సందీప్ అనే యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతని స్నేహితుడికి స్వల్ప గాయాలవగా, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సందీప్ మరణించాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కూసుమంచిలో మిషన్ భగీరథ నీటి సరఫరా

## నిలిచిపోవడంతో ప్రజల ఆందోళన

**పాలేరు, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. నాయకన్ గూడెం, భగత్ వీడు, మంగళ్తండా, మద్దివారిగూడెం, ఈశ్వరామాదారం, రాజుపేటబజార్, రాజుపేట గ్రామాల్లో ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఫిబ్రవరి 6, 2026 నాటికి నివేదికలు వెలువడ్డాయి.

## గర్భిణీలకు శ్రీమంతం:

## ఐఏఎస్ రాహుల్ సూచనలు

**కొత్తగూడెం, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూర్గంపహాడ్ అంగన్వాడీ కేంద్రంలో ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ – ఐజీడీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీమంతం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ, ఐఏఎస్ రాహుల్ సార్, ఐజీడీ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్లు ప్రల, అభిషేక్, అంగన్వాడీ టీచర్లు పద్మ, సుమిత్ర, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. ఐఏఎస్ రాహుల్ సార్ గర్భిణీ స్త్రీలకు శుభాకాంక్షలు తెలిపి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ఆవశ్యకతను వివరించారు. ఐజీడీ సంస్థ ప్రతినిధి ప్రల గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం ఒక సంతోషకరమైన వేడుక అని, రక్తహీనత (అనీమియా) బారిన పడకుండా మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

## రెండు మృతదేహాలు లభ్యం

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** హనుమకొండ యాదవనగర్ సపంలో గల్లంతైన మస్తాన్, ముకుల్ అనే ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. కేయూ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, సిబ్బంది మృతదేహాలను ఒడ్డుకు చేర్చి, పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కెనాల్లో నీటి ప్రవాహం వేగంగా, లోతు ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది.

## హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారం

**వరంగల్ వెస్ట్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మునిసిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం హోరెత్తుతోంది. ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీల నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి స్థానికంగా ఉంటూ ప్రచారం చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఎమ్మెల్యేలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టణంలో పట్టు సాధిస్తే కేడర్‌లో జోష్ పెరిగి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సులభమవుతుందని బీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీలు ప్రచారానికి పదును పెంచుతున్నాయి.

### వర్ధన్నపేట మడికొండలో అభివృద్ధి పనులకు

### నమ్మిండ్ల కుటుంబం సంపూర్ణ సహకారం

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** వర్ధన్నపేట నియోజకవర్గం, 46వ డివిజన్ మడికొండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు నమ్మిండ్ల వెంకటయ్య కుటుంబం సంపూర్ణ సహకారం అందిస్తామని కులపెద్దల సమక్షంలో తీర్మానం చేశారు. కమ్యూనిటీ హాల్ రోడ్డు ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించినందుకు జాంబవ సంఘం అధ్యక్షులు వస్కుల ఆనంద్, నమ్మిండ్ల కుటుంబానికి అభినందనలు తెలిపారు.

### నర్సాపూర్ నియోజకవర్గం

### మాసాయిపేటలో అంగన్వాడీ భవనాలకు భూమి దానం



**నర్సాపూర్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మాసాయిపేట గ్రామంలో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి భూమి దానం చేసిన కేశవరెడ్డి, వీరన్న కుటుంబ సభ్యులకు జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రూ. 24 లక్షల వ్యయంతో భవనాలు మంజూరయ్యాయని, జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: హరీష్ రావు

**మెదక్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో పర్యటించిన బీఆర్ఎస్ నేత హరీష్ రావు, సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిగాచి ప్రమాదంలో మరణించిన 54 మంది కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇస్తామని రేవంత్ సర్కార్ మాట తప్పిందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, రేవంత్ సర్కార్ రూ. కోటి పరిహారం ఇస్తే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని హరీష్ రావు సవాల్ విసిరారు. ప్రమాదం జరిగి చాలా కాలమైనా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

## గ్రామాలను వదిలి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సర్పంచులు

**సిద్ధిపేట, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మెదక్ జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాలను వదిలి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మున్సిపాలిటీల్లోని అభ్యర్థుల గెలుపు కోసం వీరు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వార్డుల్లో తిరుగుతూ అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సొంత గ్రామాల కంటే మున్సిపల్ వార్డుల్లోనే సర్పంచుల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

## మున్సిపల్ ఎన్నికల వేళా..
## రెబల్స్ ఏకమయ్యారు!

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కంది శ్రీనివాస్ రెడ్డిపై రెబల్స్‌గా పోటీచేసిన సాజిద్ ఖాన్, సుజాత, శ్రీకాంత్ రెడ్డిలు బుధవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఒకే వేదికపై కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ఆదివాసీ సంక్షేమానికి కృషి చేసిన మహానాయకుడికి నివాళి

**బోథ్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** ఆదివాసీ ప్రధాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో సాత్నాల మండలం జామిని గ్రామంలో హీరా సుఖ గారి జయంతి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రధాన్ జనజాతి ఉత్తాన్ సంఘటన రాష్ట్ర అధ్యక్షులు యాదవ్రావు కుర్సెంగే మాట్లాడుతూ, హీరా సుఖ గారి ఆశయాల సాధనకై, ఆదివాసీ దేవీ దేవతలను, సమాజాన్ని కాపాడటానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆదివాసీ సమాజ సంక్షేమానికి, వారి సంస్కృతి పరిరక్షణకు ఆయన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో విషాదం..
## కరెంట్ షాక్‌తో మహిళ మృతి

**నిర్మల్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో కరెంట్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. దొడర్న-1 తండాకు చెందిన రాథోడ్ వనితా బాయి(30) నీళ్లు వేడి చేసే క్రమంలో వాటర్ హీటర్ విద్యుత్ ప్రమాదానికి గురై మరణించింది. కుటుంబ సభ్యులు ఆమెను కుబీర్ ఆస్పత్రికి, అక్కడి నుండి బైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం



**ఖానాపూర్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిర్మల్ పట్టణంలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని 9, 30వ వార్డుల్లో పోటీ చేస్తున్న శ్రీకాంత్ యాదవ్, అయ్యన్నగారి రాజేందర్ లకు మద్దతుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి, కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మల్ పట్టణం అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని ఆయన విమర్శించారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

**ముథోల్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు ఎస్‌కే కలీంను ఘనంగా సన్మానించారు. 42 ఏళ్లుగా పోలీసు శాఖలో అంకితభావంతో సేవలు అందించిన ఆయనకు మెమోంటో, శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని ఎస్పీ జానకి షర్మిల కొనియాడారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనుస్ అలీ, ఆర్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భార్యాభర్తల గొడవ..
## భర్త ఉరేసుకుని ఆత్మహత్య

**కరీంనగర్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** భార్యాభర్తల మధ్య ఆర్థిక గొడవల కారణంగా జమ్మికుంటకు చెందిన భర్త సుద్దాల శ్రీనివాస్ (39) మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య తన సోదరికి తెలియకుండా రూ.2 లక్షలు అప్పుగా ఇవ్వడం, ఆ సొమ్ము తిరిగి రాకపోవడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీనివాస్ లుంగీతో ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు.

## కన్నీరు పెట్టుకున్న సీనియర్ నేత జీవన్ రెడ్డి!

**జగిత్యాల, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తన వర్గానికి టికెట్లు దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఓటర్ల సమక్షంలో ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. "ఈ వయసులో పార్టీ ఇలా ఇబ్బంది పెట్టడం జీర్ణించుకోలేకపోతున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సంఘటన పార్టీ కార్యకర్తలను కలచివేసింది.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో గర్జనపల్లి అశ్రిత అద్భుత ప్రతిభ



**సిరిసిల్ల, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లిలో ఈ నెల 5 నుండి 8 వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ వాలీబాల్ టోర్నమెంట్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా, వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన క్రీడాకారిణి నగరపు అశ్రిత అద్భుత ప్రతిభ కనబరిచారు. తన క్రీడా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్న అశ్రితను జిల్లా యువజన క్రీడల అధికారి రాందాస్ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గ్రాణ ప్రాంతం నుండి వచ్చిన అశ్రిత పట్టుదలను అభినందించిన ఆయన, క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. తమ గ్రామానికి చెందిన బాలిక రాష్ట్రస్థాయిలో రాణించడం పట్ల గర్జనపల్లి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# దరఖాస్తు గడువు ముగింపు



**సత్తుపల్లి, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కలెక్టర్ అనుదీప్ సూచనలు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకునే వారు ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించారు. అభ్యర్థులు ఫారమ్-12తో పాటు డ్యూటీ ఆర్డర్, ఎపిక్ కార్డు నకళ్లను సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారు ఫిబ్రవరి 8న తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఈ డీల్ భారత్‌కు ప్రయోజకరమేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్- అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య ఒప్పందానికి ఎట్టకేలకు తెరపడింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఇన్నాళ్లు 50 శాతం టారిఫ్‌లతో ఎగుమతుల్లో అమెరికా మార్కెట్‌కు దూరంగా ఉన్న భారత్ సుంకాల తగ్గింపుతో ముందంజలోకి దూసుకు వచ్చింది. అమెరికా సవరించిన టారిఫ్‌లతో భారతీయ ఎగుమతిదారులకు ఏకంగా 32 శాతం పన్ను భారం తగ్గింది. ఇది భారత ఎగుమతులకు భారీ ఊరట అని చెప్పాలి. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన వేళ దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. గ్లోబల్ పాజిటివ్ సంకేతాలు, ముఖ్యంగా భారత్ -అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా మార్కెట్లు ఓపెనింగ్ నుంచే బుల్స్‌ర్రోకి దూసుకెళ్లాయి. బీఎస్ఇ సెన్సెక్స్ 2,256 పాయింట్ల లాభంతో 83,935 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 699 పాయింట్లు పెరిగి 25,787 స్థాయిలో కదలాడుతోంది. ప్రీ- ఓపెనింగ్ సెషన్‌లోనే సెన్సెక్స్ 3,600 పాయింట్ల వరకూ ఎగబాకడం విశేషం. నిఫ్టీ 26,300 మార్క్‌ను తాకి రికార్డు స్థాయిని అందుకుంది. మార్కెట్ ప్రారంభం నుంచే అన్ని రంగాల్లో కొనుగోళ్లు జోరుగా కనిపించాయి. అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అంగీకరిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో పాటు, భారత్ ఉత్పత్తులపై ఉన్న ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై విధించిన అదనపు సుంకాలు కూడా ఈ తగ్గింపులో భాగం కావడంతో భారత ఎగుమతులకు పెద్ద ఊరట లభించనుంది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు గేమ్ ఛేంజర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారత్ ఆసియా ఎగుమతి మార్కెట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఎగుమతుల్లో ప్రాంతీయ ప్రత్యర్థులైన చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. ఈ డీల్ ముందు వరకు ఆసియాలోనే భారీగా అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొన్న దేశం భారత్. ఒక్క రాత్రిలో అది తలకిందులైంది. ఇప్పుడు 18 శాతంతో అతి తక్కువ సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో టాప్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై 19 శాతం, శ్రీలంకపై 20 శాతం, బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియా, మలేసియా, థాయ్‌లాండ్‌పై 19 శాతం చొప్పున, చైనాపై 34 శాతం సుంకాలు అమల్లోకి ఉన్నాయి. చైనాపై భారత్ కంటే దాదాపు రెట్టింపు టారిఫ్‌లు అమల్లో ఉండటం గమనార్హం. అయితే ఆసియాలో అఫ్ఘానిస్థాన్ ఒక్కటే భారత్ కంటే తక్కువ టారిఫ్‌లు 15 శాతం ఎదుర్కొంటోంది. కానీ, ఆసియా ఎగుమతి మార్కెట్‌లో అఫ్ఘానిస్థాన్ భారత్‌కు ఏ మాత్రం పోటీ కాదు. టారిఫ్‌ల తగ్గింపుతో అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు చవకగా లభించి, ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, పాదరక్షల వంటి కీలక రంగాలలో వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీ పడుతున్న భారతీయ కంపెనీలకు భారీ ఊరట కలగనుంది. టెక్స్‌టైల్స్, జెమ్స్, జ్యువెలరీ, ఫార్మా రంగాలు అమెరికా మార్కెట్‌లో మరింత పోటీనిస్తాయి. సుంకాల సవరింపు తర్వాత ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనాతో పోలిస్తే భారత్ ఇప్పుడు చాలా బలీయమైన స్థితిలో ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు మార్చేలా ప్రోత్సహిస్తుంది. భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై ఉన్న సుంకాలను, అడ్డంకులను తొలగించి 'జీరో' స్థాయికి తీసుకెళ్లడానికి ఒప్పుకున్న నేపథ్యంలో ఇరు దేశాల వాణిజ్యం కొత్త పుంతలు తొక్కనుంది. ప్రధాని నరేంద్ర మోడీతో జరిపిన 30 నిమిషాల ఫోన్ సంభాషణ అనంతరం, భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గత ఏడాది కాలంగా భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఉత్పత్తులపై మొత్తం 50 శాతం వరకు సుంకాల భారం పడుతోంది. ఇందులో 25 శాతం పరస్పర సుంకాలు కాగా, రష్యా నుంచి ఆయిల్ కొంటున్నామన్న కారణంతో మరో 25 శాతం టారిఫ్‌లను అదనంగా ట్రంప్ భారత్‌పై విధించారు. అయితే తాజా డీల్‌లో భాగంగా అదనపు సుంకాలను పూర్తిగా తొలగించడమే కాకుండా పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కెనడా-భారత్ యురేనియం ఒప్పందం అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ కెనడాపై భారీ సుంకాలను విధిస్తానని బెదిరించిన సమయంలో భారత్ -కెనడా సంబంధాలు దగ్గరగా మారుతున్నాయి. ఇటీవల కార్నీ మార్చిలో భారత్ సందర్శించవచ్చని, నవంబర్ 2025 నుండి నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు తిరిగి ప్రారంభించే అవకాశం ఉందని నివేదికలు వచ్చాయి. ముఖ్యంగా యురేనియం ఒప్పందం ద్వారా సుమారు రూ. 25,000 కోట్ల (సుమారు 25 బిలియన్ డాలర్లు ) విలువైన వ్యాపారం జరుగుతుందని సూచిస్తున్నారు. భారత్ అనేక దక్షిణ అమెరికా దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు ప్రారంభించింది. చమురు సరఫరా కూడా కొనసాగుతోంది. ఈ పరిణామాలు అమెరికా అధ్యక్షుడి ఆందోళనను మరింత పెంచాయి. అమెరికా- చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొత్తది కాదు. చైనా ఇటీవల విడుదల చేసిన ఎగుమతి గణాంకాలు, 2025 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించగలదని చూపించాయి. అమెరికా చైనాపై అధిక సుంకాలను విధించినప్పటికీ, చైనా ప్రపంచం వివిధ దేశాలలో సుంకాలను పెంచింది. ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ ప్రధాన పాత్ర పోషించగల దేశంగా ఉంది. భారత ఉత్పత్తులను పొందడం, ప్రపంచ దేశాల మద్దతు, యూరప్- భారత్ ఒప్పందం, అమెరికా కంపెనీల భారత ప్రాధాన్యతలపై దృష్టి, ఇలా కలిపి ట్రంప్ భారత్‌పై సుంకాలు తగ్గించడానికి సహకరించారని అంటున్నారు.

# పతాకస్థాయికి ప్రచారం





**హైదరాబాద్, ఫిబ్రవరి 6 పెన్ పవర్:** సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య యుద్ధ వాతావరణం ఉంటుంది. పోటాపోటీగా నాయకులు విమర్శలు చేసుకుంటారు. నువ్వా నేనా అన్నట్టుగా వ్యవహ రిస్తుంటారు. వ్యూహాలు అమలు చేయడంమాత్రమే కాదు.. వాటిని తమకు అనుకూలంగా నడపడంలోనూ క్రియాశీలంగా వ్యవహరిస్తుంటారు. తెలంగాణలో ఒకప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో యుద్ధ వాతావరణం ఉండేది. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా అదేస్థాయిలో వాతావరణం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో కేసీఆర్ కుటుంబం మీద విమర్శలు చేస్తున్నారు. కేటీఆర్ నుంచి మొదలు పెడితే హరీష్ రావు వరకు కూడా అదే స్థాయిలో ముఖ్యమంత్రికికౌంటర్ ఇస్తున్నారు. ఫలితంగా మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ వర్సెస్ కారు పార్టీ అన్నట్టుగా మారిపోయాయి. ఇటీవల స్థానిక ఎన్నికల్లో కమలం పార్టీ కూడా మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో.. తాను కూడాపురపాలక ఎన్నికల్లో సత్తా చూపిస్తామని కమలం పార్టీ నాయకులు అంటున్నారు. ఇప్పటికే కమలం పార్టీ తమ జాతీయ అధ్యక్షుడిని తెలంగాణకు తీసుకొచ్చింది. ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టింది.తెలంగాణ రాష్ట్రంలో116 మున్సిపాలిటీలకు ఫిబ్రవరి 11న ఎన్నికలు జరుగుతాయి. ఇవే కాకుండా ఏడు కార్పొరేషన్లు కూడా ఎన్నికలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు విడుదలవుతాయి. జనవరి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణపూర్తయింది. ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ కూడా ముగిసింది. మొత్తంగా చూస్తే అన్ని ప్రాంతాలలో పోటీ హోరాహోరీగా ఉంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో.. ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మెజారిటీ స్థానాలలో గెలుపు తమదేనని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ భారీగా సీట్లను దక్కించుకుంది. ఈ నేపథ్యంలో అదే హవా మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందని ఆ పార్టీనేతలు చెబుతున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో విజయం సాధిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన మీద మరింత పట్టు లభిస్తుందని.. వచ్చేసారి కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలుచెబుతున్నారు.ప్రభుత్వ వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. అందువల్లే తాము స్థానిక సమస్యలను ఏజెండగా రూపొందించామని.. ఎన్నికలలో ప్రచార ఆస్తులుగా వాటినిఉపయోగిం చుకుంటామని గులాబీ నేతలు చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి చుక్కలు చూపించామని.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే ధోరణి కొనసాగిస్తామని కారు పార్టీ నేతలు అంటున్నారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో ఇప్పటికే తమ పార్టీ అధి నాయకత్వం విధివిధానాలకు పొందించిందని.. వాటికి తగ్గట్టుగా పని చేసుకుంటూ పోతామని కారు పార్టీ నేతలు అంటున్నారు. గ్రేటర్ పరిధిలో కారు పార్టీకి మెజారిటీఎమ్మెల్యేలు ఉన్న నేపథ్యంలో.. వారికి పార్టీ అధినాయకత్వం టాస్క్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మెజారిటీ స్థానాలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్టు సమాచారం.ఇక బిజెపి పట్టణ ఓటింగ్ మీద ప్రధానంగాదృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో తమకు మెరుగైన ఓటు బ్యాంకు ఉందని కమలంపాటి నాయకులు చెబుతున్నారు. అందువల్లే ఆ పార్టీ నాయకులు మునిసిపాలిటీల వారీగా.. కార్పొరేషన్లవారీగా ఇన్చార్జిలను నియమించారు. అంతేకాదు వారితో పాటు సమీక్షలను నిర్వహిస్తున్నారు. వరుసగా సమావేశాలు కూడా జరుపుతున్నారు. తెలంగాణలో దాదాపు ఐదు కార్పొరేషన్లు.. సగం మున్సిపాలిటీలనుదక్కించుకోవాలని కమలం పార్టీ నిర్దేశించుకుంది. అందువల్లే సేవ్ తెలంగాణ.. ఓటు తెలంగాణ అనే నినాదంతో ముందుకు వెళ్తోందిడఈ ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ సత్తా చూపించడానికి సిద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలోకేడర్ ఉన్నచోట సిపిఎం పోటీ చేస్తుంది. అక్కడ ఉన్న పరిస్థితుల ఆధారంగా సిపిఐ రంగంలో ఉంది. తనకు అవకాశాలకు తగ్గట్టుగా అటు కాంగ్రెస్.. ఇటు గులాబీ పార్టీ నేతలతో సంప్రదింపులు జరిపి.. పోటీలో ఉంది. ఇలా అన్ని పార్టీలు తమ తమ ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతిమంగా కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో పాగా వేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాయి. ఈనెల 13తో వెలుపడే ఫలితాలు అన్ని పార్టీల జాతకాలు బయటపడతాయి.

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే వారు అసామాన్యులు. కాలూనిన అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి. చరిత్రలో లభ్యమవుతున్న, మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్టే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్యజీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ధి' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్దరకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలములో కృష్ణా నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారములతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క, తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో

ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వాఙ్మయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచు కుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.

# వైసిపి పై కూటమి బ్రహ్మాస్త్రం సిద్ధం




**విజయవాడ, ఫిబ్రవరి 6, పెన్ పవర్:**
ఏపీ విషయంలో భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో సమావేశం కావడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. వారిద్దరి మధ్య సుదీర్ఘ భేటీ కొనసాగింది. ఇది సాధారణ భేటీ కాదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పెకిలించే భారీ వ్యూహంతో జరిగిన సమావేశం అని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లోని ప్రకంపనలు సృష్టిస్తోంది. మున్ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా అంశాల్లో టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పవన్ ఢిల్లీ వెళ్లారు. అమిత్ షా తో భేటీ అయ్యారు. అటు నుంచి వచ్చిన వెంటనే జనసేన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో వైఫల్యాలను ప్రస్తావించారు. చివరకు తన సోదరుడు నాగబాబును సైతం తప్పు పడుతూ మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. తిరుమల లడ్డు వివాదానికి సంబంధించి ఎందుకు మాట్లాడలేదని కూడా ప్రశ్నించారు. అలా సొంత పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసిన పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈరోజు మళ్లీ సీఎం చంద్రబాబు తో పాటు బిజెపి నేతలతో కూడా సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నారు పవన్. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకుంటూ భారీ వ్యూహం సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది. నెయ్యి వివాదానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం చేపట్టిన విచారణ, దానికి సంబంధించి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేసింది. అయితే 36 మంది నిందితులుగా చూపింది. అందులో కల్తీ నెయ్యి సరఫరా చేసిన డైరీ యజమానులు, టిటిడి మాజీ ఉద్యోగుల పాత్ర బయటపడింది. నెయ్యి బదులు పామాయిల్ మిశ్రమాన్ని, కెమికల్స్ ను వాడి కోట్లాదిమంది భక్తుల నమ్మకాన్ని తాకట్టు పెట్టిన వారిని అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం బలమైన సందేశాన్ని పంపాలని నిర్ణయించింది. కేవలం అరెస్టులకి పరిమితం కాకుండా.. గత ప్రభుత్వంలోని కీలక నేతల ప్రమేయంపై ఆధారాలను ప్రజల ముందు ఉంచే ఆలోచనలో ఉంది కూటమి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేయనుంది కూటమి. ఈ అంశాన్ని కేవలం ఒక కేసుగా మాత్రమే కాకుండా.. హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో సామాన్య భక్తుల దగ్గరకు తీసుకెళ్లాలని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఎదురుదాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టడమే కాకుండా.. వారు చేసిన తప్పులను ప్రజల వద్ద చర్చించేలా ప్రచార వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో ప్రజాక్షేత్రంలో భారీ బహిరంగ సభలు లేదా ధర్మరక్షణ యాత్రల ద్వారా ప్రజలకు వాస్తవాలను వివరించే అవకాశం ఉంది. ఈ విషయంపైనే పవన్ కళ్యాణ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో చర్చించారని.. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత పవన్ ఈ విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చించారని.. ఈరోజు రాష్ట్ర బిజెపి నేతలతో కలిసి భారీ వ్యూహరచన చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే టార్గెట్ అవుతుందన్నమాట.

# జగన్ మారినట్టేనా సామాన్యులకు దొరకని అపాయింట్ మెంట్



**గుంటూరు, ఫిబ్రవరి 6, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించాలి. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి వచ్చి కలసి ఫొటోలు దిగి స్టేటస్ గా పెట్టుకున్న వారికే పదవులు ఇవ్వకుండా గ్రామాల్లో ఎవరు నిజంగా కష్టపడుతున్నారు? ఎవరికి జనంలో బలం ఉందన్నది చూడాలి. అది తెలుసుకోవాలంటే కేవలం కోటరీమీదనో.. స్థానిక నాయకుల మీదనో ఆధారపడితే మళ్లీ చరిత్ర పునరావృతమవుతుంది. ఎందుకంటే నాడు జరిగిన తప్పులే మళ్లీ జరగకుండా ఉండాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పెరగాలని కోరుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి జగన్ ను తాడేపల్లి కార్యాలయానికి కలవడానికి వచ్చిన వాళ్లకు ఇప్పటికీ జగన్ అపాయింట్ మెంట్ దొరకడం లేదు. జగన్ బయటకు వెళితే కార్యకర్తలు బాగానే వస్తున్నారు. వారు వస్తున్నది కూడా యాభై శాతం జగన్ మీద అభిమానం అయితే.. మిగిలిన యాభై శాతం స్థానిక నాయకుల మీదన్న విషయం గుర్తుంచుకోవాలంటున్నారు. వైసీపీలో లో ఎప్పుడు నిజంగా కష్టపడే వాడికి ఫలితం దక్కేది ఎప్పుడంటూ సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి నియోజకవర్గంలోనూ రెండు మూడు వర్గాలున్నాయి. మాజీ ఎంపీ వర్గం, మాజీ ఎమ్మెల్యే వర్గం, జగన్ కి వ్యక్తిగత పరిచయం అని చెప్పుకునే మరొక వర్గం ఇలా మూడు గ్రూపులుగా అన్ని గ్రామాల్లో విడిపోయి తమ వర్గాల వారికి పదవులు ఇప్పించుకోవడానికి తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారుపార్టీ పదవుల నుంచి అన్నీ వారు చెప్పిన వారికే నాయకత్వం కూడా ఇస్తుండటంతో అసలైన, సిసలైన కార్యకర్త మాత్రం డీలా పడిపోయాడు. నియోజకవర్గ పదవులు వేసే క్రమంలో మూడు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో మూడు గ్రూపులుగా విడిపోయి నియోజకవర్గాల్లో వైసీపీ కార్యకర్తలు క్రాస్ రోడ్స్ లో ఉన్నారు. జగన్ వచ్చినప్పుడు అందరూ కలసి కట్టుగా కనిపిస్తున్నా ఆ తర్వాత మాత్రం ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలని అనుకున్న దానికి ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. కార్యకర్తల అభీష్టాన్ని తెలుసుకొని ఇస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఎంపిక చేస్తే ఫలితం ఉంటుంది. అంతే తప్ప ఎవరో సిఫార్సుతో పదవులు ఇస్తే పార్టీ అధికారంలోకి రావడం కష్టమే. ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలి.

# కరవు భత్యం ఉద్యోగుల హక్కు

**హైదరాబాద్ పెన్ పవర్:** లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో గురువారం భారీ ఉపశమనం లభించింది. కరవు భత్యం (డీఏ) పొందడం ఉద్యోగుల చట్టబద్ధమైన హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2008–2019 కాలానికి సంబంధించి డీఏను ఉద్యోగులకు చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బకాయిపడిన మొత్తంలో 25శాతాన్ని మార్చి 6వ తేదీకల్లా ఉద్యోగులకు అందజేయాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం తెలిపింది. అఖిల భారత వినియోగ ధరల సూచీ (ఏఐసీపీఐ) ప్రకారం నిర్ణయించిన డీఏ లెక్కింపు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆఫీస్ మెమోరాండం ద్వారా సవరించడానికి వీల్లేదని పేర్కొంది. 'డీఏ అదనపు ప్రయోజనం కాదు. కనీస జీవన ప్రమాణాల నిర్వహణకు ఇది సాధనం. పౌరుల సామాజిక, ఆర్థిక సంరక్షణ బాధ్యత సంక్షేమ రాజ్య ప్రభుత్వాలదే'నని ధర్మాసనం తెలిపింది. తీర్పు అమలు ఆర్థికంతో ముడిపడి ఉన్నందున మొత్తం డీఏ చెల్లింపు నిర్ధారణ, చెల్లింపుల షెడ్యూల్, విడతల వారీగా నిధుల విడుదల పర్యవేక్షణకు ఓ కమిటీని నియమిస్తున్నట్లు వెల్లడించింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులూ అప్పటి బకాయిలకు అర్హులేనని తెలిపింది. ఏప్రిల్ 15వ తేదీకల్లా స్థాయీ నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం డీఏ బకాయిలు రూ. 41వేల కోట్లు ఉంటాయని అంచనా.

# శ్రీనివాసుడితో గేమ్స్..

**తిరుమల, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిందా? అన్నది పక్కన పెడితే భక్తుల మనోభావాలతో మాత్రం రాజకీయ నేతలు ఆటాడుకుంటున్నాయి. ఏడు కొండల వాడితో గేమ్స్ ఇప్పటి నుంచి కాదు దాదాపు ఏడాదిన్నర క్రితమే ప్రారంభమయింది. పాలకులయినా.. ప్రతిపక్షమయినా భక్తుల మనోభావాల పట్ల జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. రాజకీయ ప్రయోజనాలు నేడు వస్తాయి. లేకుంటే రావు. అంతే తప్ప కొన్ని వందల దశాబ్దాల నాటి చరిత్ర ఉన్న తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో మాత్రం పాలక, ప్రతిపక్షాలు భక్తులను పట్టించుకోకుండా రాజకీయ పరమావధిగానే ప్రయాణం చేస్తున్నాయి. ఒక రకంగా ఏడుకొండల వాడిని ఓట్లు తెచ్చి పెట్టే ఒక సాధనంగా భావిస్తున్నాయనుకోవచ్చు. నిజానికి సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. తిరుమల లడ్డూ కల్తీ విషయంలో ఎలాంటి వివాదాలు చేయవద్దని, ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా సరే ఒకిరిని మించి మరొకరు ఈ లడ్డూ ప్రసాదం విషయంలో తప్పటడుగులు వేస్తున్నారు. ఈ వివాదాన్ని సిట్ ఛార్జిషీట్ తర్వాత వదిలేస్తే సరిపోయేది. కానీ దానిని పట్టుకుని లాగినంత మాత్రాన దక్కే ప్రయోజనం మాత్రం ఎవరికీ ఉండకపోవచ్చు. తిరుమల లడ్డూ తయారీ 350 ఏళ్లకు పైగానే సాగుతుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ లడ్డూ తయారీలో మాత్రం కల్తీ చేయడానికి సాహసించవు. కావాలంటే వేరే మార్గంలో డబ్బులు దండుకునే మార్గం చూసి ఉండవచ్చు కానీ, భక్తులకు అందించే ప్రసాదంలో మాత్రం అటువంటి నీచ చర్యలకు ఎవరూ పాల్పడరు. చివరకు సరఫరా చేసే కంపెనీలు సయితం లాభాపేక్షతో పాటు ఆధ్యాత్మికతతో ఉంటాయన్నది వాస్తవం. సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని, సీబీఐ పర్యవేక్షణలో సిట్ విచారణ జరుపుతుంటే, దానికి సమాంతరంగా రాష్ట్ర ప్రభుత్వం మరో విచారణ కమిటీని వేయడం అంటే దీనిని లాగేందుకే పాలక పక్షం సిద్ధమయింది. కల్తీ జరిగింది అనేది వాస్తవమే అని సిట్ చార్జిషీట్ లో పేర్కొంది. అది సింథటిక్ నెయ్యి అని, అందులో చుక్క పాలు గానీ మీగడ గానీ లేవని తేలింది. అదొక ఘోరమైన నేరం అనడంలో సందేహం లేదు. అయితే ఆ నేరస్తులను శిక్షించడానికి సిట్ నివేదిక సరిపోతుంది. మళ్లీ కమిటీ వేసి సుదీర్ఘంగా సాగదీయడమే పనిగా పాలకపక్షం పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. తిరుమలలో భక్తుల రద్దీ తగ్గలేదు. అంటే ప్రజలు నమ్మడం లేదనే అనుకోవాల్సిందని గుర్తుంచుకోవాలి. సిట్ నివేదిక ప్రకారం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, అంతే తప్ప ఇక సాగదీయడం శ్రేయస్కరం కాదన్నది గుర్తుంచుకోవాలి.

# విశాఖపట్నం టు రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే


**విశాఖపట్టణం, ఫిబ్రవరి 6, పెన్ పవర్:** ఏపీ మీదుగా విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పులు వేగవంతం చేశారు. చిన్నయ్యపాలెం దగ్గర ఇంటర్ ఛేంజ్, సూరెడ్డి పాలెం దగ్గర డబుల్ ట్రంపెట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ పనుల్ని వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా నిర్మిస్తున్న మరో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులపై కీలక అప్డేట్ వచ్చింది. విశాఖపట్నాన్ని రాయపూర్‌తో కనెక్ట్ చేసే ఈ ఆరు లైన్ల ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు సబ్బవరం– షీలానగర్ మధ్య వేగవంతం అయ్యాయి. ఈ హైవే పనుల్లో భాగంగా చిన్నయ్యపాలెం దగ్గర ఇంటరఛేంజ్ నిర్మాణం జరుగుతోంది. అలాగే సూరెడ్డిపాలెం సమీపంలో డబుల్ ట్రంపెట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. అక్కడ భూమిని చదును చేసి ల్యాండ్ ఫిల్లింగ్, డ్రైనేజీల నిర్మాణానికి కాలువల్ని తవ్వుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద, పెద్ద మెషిన్ల సాయంతో కార్మికులు పనుల్ని చేపట్టారు. సబ్బవరం–షీలానగర్ మధ్య చేపట్టిన హైవే పనుల్లో భాగంగా.. అమృతపురం శివారు సూరెడ్డిపాలెం నుంచి షీలానగర్ మొత్తం 12.66 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. అయితే 8 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో షీలానగర్ దగ్గర ఎన్‌హెచ్–16, విశాఖపట్నం పోర్టు రోడ్డుకు కనెక్ట్ చేస్తారు. గతంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా భూసేకరణ ఆలస్యం కావడంతో పనుల్లో కూడా జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కారం కావడంతో పనులు మరింత ఊపందుకున్నాయి. విశాఖపట్నం–రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. విజయనగరం జిల్లా కంటకాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకు నాలుగో ప్యాకేజీ కింద పనులు పూర్తి చేశారు. ఈ హైవే చిన్నయ్యపాలెం దగ్గర అనకాపల్లి–ఆనందపురం హైవేలో కలిసేలా ప్లాన్ చేశారు. రాయ్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటరు దూరంలో ఉండే సూరెడ్డిపాలెం వరకు అనకాపల్లి–ఆనందపురం హైవేలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడ డబుల్ ట్రంపెట్ నిర్మాణం జరుగుతోంది.. షీలానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి, ఆనందపురం, రాయపూర్ వైపు వెళ్లేలా ఈ డబుల్ ట్రంపెట్ నిర్మాణం చేపట్టారు. 2027 చివరికి సబ్బవరం–షీలానగర్ మధ్య ఈ హైవే అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే విశాఖలోని నేషనల్ హైవేపై భారీ వాహనాల రద్దీ తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ హైవే మొత్తం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు.

**ఫ్రీ సిగ్నల్ జర్నీ**

విశాఖపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా మరో ముందడుగు పడింది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలి దగ్గర కాకానినగర్ దగ్గర ఆర్వోబీ ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఈ పనునలు ముగింపు దశలో ఉండగా.. ఈ ఆర్వోబీని ఈ నెలలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకానినగర్ కూడలికి సమీపంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కూడా నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో హైవేలు, రైల్వే ప్రాజెక్టుల్ని వేగవంతం చేసింది. విశాఖపట్నంలో కీలకమైన ఆర్వోబీ (రైల్ ఓవర్ బ్రిడ్జి) అందుబాటులోకి రాబోతోంది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలికి వెళ్లేందుకు.. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ఈజీగా ఉంటుంది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి కాకానినగర్ కూడలికి వెళ్లేందుకు ఈ ఆర్వోబీ పనులు ముగింపు దశకు వచ్చాయి.. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయంటున్నారు. వాస్తవానికి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టిన సమయంలోనే ఆ ఆర్వోబీ కూడా రెండేళ్ల క్రితమే పూర్తి చేయాల్సింది. అయితే కోల్‌కతా–చెన్నై మెయిన్ లైన్‌లో నిర్మాణం చేయాల్సి ఉండటంతో అనుమతుల రాకపోవడంతో ఆలస్యం అయ్యింది. ఈ ఆర్వోబీని 18 మీటర్ల ఎత్తులో 210 మీటర్ల పొడవుతో రైలు పట్టాలపై నిర్మాణం చేశారు. ఆ ఆర్వోబీకి రెండు పక్కల అప్రోచ్ రోడ్లు కూడా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలి నుంచి 200 మీటర్లు.. అటు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డులో 300 మీటర్ల పొడవుతో లింక్ చేస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి.. ప్రస్తుతం ఎన్ఏడీ వైపు నుంచి మట్టి తవ్వి రోడ్డు నిర్మాణం, రెయిలింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వైపు తారు రోడ్డు పనుల చేస్తున్నారు. ఇక్కడ మొత్తం ఆరు రోడ్లు అందుబాటులోకి వస్తాయి. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద, పై నుంచి రాకపోకలకు అవకాశం ఉంటుంది. ఈ నెల 15 నుంచి ఆర్వోబీ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. దీని కోసం 24 గంటలూ పనులు కొనసాగుతున్నాయి.. అయితే కాకాని నగర్ కూడలి దగ్గర విప్ గణబాబు సూచనలతో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. కాకానినగర్ కూడలికి 100 మీటర్ల ముందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కూడా త్వరలోనే మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి కూడా పూర్తి చేస్తే సిగ్నల్ లేకుండానే రాకపోకలు సులభంగా ఉంటాయి అంటున్నారు. మొత్తం మీద నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ఈ ఆర్వోబీ కీలకంగా మారనునంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# తైవాన్‌కు ఆయుధ సరఫరాలపై వివేకంతో వ్యవహరించండి



**హైదరాబాద్ పెన్ పవర్:** తైవాన్‌కు ఆయుధాల సరఫరా విషయంలో వివేకంతో వ్యవహరించాల్సిందిగా చైనా నేత జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను హెచ్చరించారు. రెండు దేశాల అధినేతల మధ్య బుధవారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఆ వివరాలను చైనా విదేశాంగ శాఖ ఓ ప్రకటన రూపంలో తెలియజేసింది. 'చైనా–అమెరికా సంబంధాలలో తైవాన్ అత్యంత ముఖ్యమైన విషయమని జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. చైనా తన సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను విధిగా పరిరక్షించుకోవాల్సి ఉంది. తైవాన్ వేరుపడడాన్ని ఎన్నటికీ అనుమతించదు. కాబట్టి తైవాన్‌కు ఆయుధ సరఫరాల విషయంలో అమెరికా వివేకంతో, జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది' అని ఆ ప్రకటన వివరించింది. కాగా తైవాన్ భవిష్యత్తు సహా అనేక అంశాలపై జిన్‌పింగ్‌తో చర్చించానని ట్రంప్ తెలిపారు. జిన్‌పింగ్‌తో సంభాషణ అద్భుతంగా జరిగిందని, అన్ని విషయాలపై కూలంకషంగా చర్చించామని ఆయన ట్రూత్ సోషల్‌లో వివరించారు. ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న యుద్ధం, ఇరాన్‌తో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, అమెరికా నుంచి చమురు–గ్యాస్ కొనుగోళ్లు కూడా ప్రస్తావనకు వచ్చాయని చెప్పారు. ఏప్రిల్‌లో చైనాలో పర్యటించాలని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో అమెరికా నుంచి 20 మెట్రిక్ టన్నుల సోయాబీన్ కొనుగోలును చైనా పరిశీలిస్తోందని అన్నారు.

## అమెరికా ప్రజాస్వామ్యంపై ట్రంప్ దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థకు చెందిన కీలక మూల స్తంభాలపై దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడి చేశారని అంతర్జాతీయ సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ తన తాజా నివేదికలో విమర్శించింది. ట్రంప్ అవలంబించిన అనేక విధానాలను ఆ నివేదిక తప్పుపట్టింది. వలసదారులను అణచివేశారని, ప్రజల ఓటింగ్ హక్కులకు భంగం కలిగించారని తెలిపింది. గతంలో ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కులకు అమెరికా బాసటగా నిలిచిందని, కానీ ట్రంప్ ప్రభుత్వం ఆ విధానం నుంచి వైదొలిగిందని ధ్వజమెత్తింది. మానవ హక్కులకు విఘాతం కలిగిస్తున్న రష్యా వంటి దేశాలకు అమెరికా కొమ్ముకాస్తోందని, నిరంకుశ పాలకులను ప్రశంసనలతో ముంచెత్తుతోందని హ్యూమన్ రైట్స్ వాచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫిలిప్ బొలోపియాన్ విమర్శించారు. '2026లో మానవ హక్కుల భవిష్యత్తు కోసం అమెరికాలో పోరాటం తీవ్రంగా సాగుతుంది. దాని పర్యవసానాలు ప్రపంచంలోని మిగిలిన దేశాలపై కూడా పడతాయి. అమెరికాలో ఓ రకమైన అత్యంత ప్రతికూల వాతావరణాన్ని, ప్రజాస్వామ్య నాణ్యతలో క్షీణతను చూస్తున్నాము' అని ఆయన బుధవారం ఓ వీడియోలో తెలియజేశారు. ట్రంప్ ప్రభుత్వం జాత్యాహంకార దాడులపై ఆధారపడిందని, శ్వేత జాతీయతావాద భావజాలానికి అనుగుణంగా ఉండే విధానాలను అవలంబిస్తోందని అన్నారు. వలసదారులు, ఆశ్రయం కోరే వారి విషయంలో ట్రంప్ ప్రభుత్వం అవమానకరంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ మిన్నెపొలిస్‌లో ఇద్దరు వ్యక్తులను ఐసీఏ ఏజెంట్లు కాల్చి చంపడం, ఎల్‌సాల్వెడార్‌లోని మెగా జైలుకు వందలాది మంది వలసదారులను తరలించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. వలసదారుల అణచివేతకు సంబంధించిన ఇతర అంశాల గురించి కూడా బొలోపియాన్ మాట్లాడారు. రష్యాలో పుతిన్ పౌర సమాజంపై అణచివేతను తీవ్రతరం చేశారని ఆయన విమర్శించారు.

## వెంటనే ఇరాన్ వీడండి

## తన పౌరులకు అమెరికా అడ్వైజరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగశాఖ జారీ చేసిన అడ్వైజరీ ఆందోళన కలిగిస్తోంది. 'వెంటనే ఇరాన్‌ను వీడండి' అంటూ యూఎస్ తన పౌరులను అప్రమత్తం చేసింది. "వెంటనే వీడటం వీలుకాకపోతే.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి" అంటూ అడ్వైజరీ జారీ అయింది. అయితే నెటిజన్లు కొందరు ఇది కొత్త అడ్వైజరీ కాదంటూ పోస్టులు పెడుతున్నారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న ఇరాన్.. స్వదేశంలో జరిగిన భారీ నిరసనల నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. అడ్వైజరీకి ముందు ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. "ఖమేనీ చాలా కలత చెందక తప్పదు" అని పేర్కొన్నారు. దీంతో అమెరికా దాడులు చేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దేశాల మధ్య అణు చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ప్రకటనలు రావడం గమనార్హం. ఒమన్‌లో జరగనున్న చర్చల్లో కేవలం అణు అంశాల పైనే కాకుండా, ఇతర విషయాల పైనా సమాలోచనలు జరపాలని ఇరాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## విజయ్ రిట్ పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** పన్ను జరిమానా కేసులో ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగమ్ (టివికె) అధ్యక్షుడు విజయ్ రిట్ పిటిషన్‌ను మద్రాస్ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2015 సెప్టెంబర్ 30న ఐటి అధికారులు నిర్వహించిన సోదాలను అనుసరించి మాత్రమే నటుడు విజయ్ పన్నులు చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 2015–16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ.1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజయ్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి.సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ.16కోట్ల పారితోషకంతో పాటు రూ.4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

# విపత్తు బాధితులకు లీజు ప్రాతిపదికన భూమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకృతి విపత్తుల్లో ఇండ్లు కోల్పోయిన వారికి లీజు పద్ధతిలో భూమిని కేటాయిస్తామని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రకటించారు. 2025లో ప్రకృతి వైపరీత్యాలతో నివాసాలను కోల్పోయిన కుటుంబాలకు 40ఏండ్ల లీజు ప్రాతిపదికన ఐదు 'మర్లాస్' (1.60 ఎకరాలు) భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. ఉదంపూర్ జిల్లాలో మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ప్రభావితమైన 6,400 కుటుంబాలకు రూ.23.49 కోట్లకు పైగా ఆర్థికసాయం అందించినట్టు ఆయన తెలిపారు. బీజేపీ సభ్యుడు బల్వంత్ సింగ్ మంకోటియా అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ఒమర్ అబ్దుల్లా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. మంత్రిమండలి నిర్ణయం తీసుకుందని, ఈ ఏడాది జనవరి 2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భూకంపాలు, క్లౌడ్‌బరెస్ట్, కొండచరియలు విరిగిపడటం, వరదలతో నిరాశ్రయులైన ప్రతి భూమి లేని కుటుంబానికి ఐదు మర్లాస్ (1.60 ఎరాలు) ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ఆమోదం తెలిపినట్టు పేర్కొన్నారు. నివాస అవసరాల కోసం ఎటువంటి ప్రీమియం వసూలు చేయకుండా లీజు ప్రాతిపదికన భూమిని అందిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు 40 సంవత్సరాల కాలానికి మార్లాకు రూ.10 వార్షిక గ్రౌండ్ అద్దె చెల్లించాల్సి వుంటుంది. దీనిని సమర్థ అధికారం ఆమోదం పొందిన తర్వాత నిబంధనల ప్రకారం మరింత పొడిగించవచ్చు అని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న షరతులకు లోబడి కేటాయింపు వుంటుందని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఉధంపూర్, చెనాని, రామ్‌నగర్ మరియు లట్టి–మరోతి తహసీల్‌లో మొత్తం 6,449 బాధిత కుటుంబతాలకు నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరిహారం అందించబడిందని అన్నారు. ఉధంపూర్ తహసీల్‌లోని 2,666 బాధిత కుటుంబాలకు రూ.9.32కోట్లు, చెనాని తహసీల్‌లోని 1,208 కుటుంబాలకు రూ.5 కోట్లకు పైగా మంజూరైందని చెప్పారు. రామ్‌నగర్ తహసీల్‌లో 2,298 బాధిత కుటుంబాలకు రూ.7.8635కోట్లు మంజూరు కాగా, లట్టి–మరోతి తహసీల్‌లో 277 కుటుంబాలకు కోటి రూపాయలకు పైగా సాయం అందించబడిందని అన్నారు. నష్ట అంచనాను నిర్వహించామని మరియు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నిబంధనల ప్రకారం అర్హత కలిగిన కేసులను ధ్రువీకరించామని అన్నారు. సంబంధిత ఆర్థిక విధానాల ద్వారా బాధిత కుటుంబాలకు పరిహారం మంజూరైందని, నేరుగా పంపిణీ చేశామని అన్నారు.

# బెంగాల్‌లో డీఏ చెల్లింపులపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్(డీఏ) పెండింగ్ బకాయిలను 25శాతంతో విడుదల చేయాలని సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పులను స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) స్టేట్ సెక్రటరీ ఎండీ సలీమ్ అన్నారు. "ఇది కార్మికులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారుల హక్కు" అని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి అన్నారు. కేవలం రెండు రోజుల క్రితం కేరళ ప్రభుత్వం డియర్‌నెస్ అలవెన్స్‌ను(డీఏ) ప్రకటించింది. డిఏ హక్కు కాదని వాదించడానికి మమతా బెనర్జీ కోర్టును కూడా ఆశ్రయించారు. కానీ హైకోర్టు దానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ, మమతా బెనర్జీ కోర్టు నిర్ణయాన్ని అంగీకరించలేదు. తాజాగా 25% పెరుగుదల అవసరమని సుప్రీంకోర్టు చెప్పింది, ఆ మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించిందన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగుల మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (ఆం) చెల్లింపుపై వివాదం నడుస్తోంది. ఉద్యోగులకు డీఏలు చెల్లించడం తప్పనిసరి ఏమి కాదని మమత సర్కార్ వాయిదా వేస్తు వస్తోంది. టీఎంసీ సర్కార్ నిర్ణయాన్ని ఉద్యోగులు రాష్ట్ర కోర్టులో సవాల్ చేయగా,
వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ రాష్ట్ర కోర్టు తీర్పును మమత ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కర్నాల్ ధర్మాసనం ఉద్యోగులకు డీఏ చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో దాదాపు 20 లక్షల మంది ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధిపొందనున్నారు.

# మనసులను దగ్గర చేసే గులాబీ

ఫిబ్రవరి 7న జరుపుకునే గులాబీ దినోత్సవం ఆధునిక ప్రపంచంలో ప్రేమ, స్నేహం, గౌరవం, కృతజ్ఞత వంటి మానవీయ భావాల వ్యక్తీకరణకు ప్రతీకగా నిలిచిన ఒక ప్రత్యేక దినంగా మారింది. సాధారణంగా "రోజ్ డే"గా పిలువబడే ఈ రోజు వాలెంటైన్స్ వారానికి ఆరంభ సూచికగా పరిగణించ బడినా, దాని అంతరార్థం కేవలం ప్రేమికుల పరిమిత ప్రపంచంలోనే కాదు; సమాజంలోని అన్ని సంబంధాలకు సున్నితమైన భావాలను తెలియజేసే ఒక సాంస్కృతిక వేదికగా విస్తరించింది. మాటల్లో చెప్పలేని అనుభూతులను ఒక చిన్న పువ్వు ద్వారా వ్యక్తపరచడం అనేది మానవ నాగరికతలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న సాంప్రదాయం. ఆ పరంపరకి ఆధునిక రూపమే గులాబీ దినోత్సవం. గులాబీ పువ్వు చరిత్ర మానవ నాగరికత చరిత్రతో సమాంతరంగా సాగింది. ప్రాచీన గ్రీకు, రోమన్ నాగరికతల్లో గులాబీ ప్రేమ, అందం, జీవశక్తి, పవిత్రతకు ప్రతీకగా భావించబడింది. గ్రీకు పురాణాల్లో ప్రేమ దేవత అఫ్రొడైటీతో గులాబీకి ఉన్న అనుబంధం దానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, భావోద్వేగ విలువను తెచ్చిపెట్టింది. రోమన్లు గులాబీని రహస్యాల సంకేతంగా కూడా భావించేవారు; అందుకే "సబ్ రోసా" అనే పదప్రయోగం రహస్య సంభాషణకు సూచికగా నిలిచింది. భారతీయ సంస్కృతిలో గులాబీ ఆతిథ్యం, సౌందర్యం, సానుభూతికి చిహ్నంగా మారింది. ఆలయాల అలంకరణ లోనూ, శుభకార్యాల్లోనూ, సాహిత్యంలోనూ గులాబీ స్థానం ప్రత్యేకం. సంస్కృత, తెలుగు సాహిత్యాల్లో గులాబీ సుగంధం ప్రేమానురాగాలకు రూపకంగా తరచూ వినిపిస్తుంది.

విక్టోరియన్ యుగంలో పాశ్చాత్య సమాజంలో పువ్వుల ద్వారా భావాలను తెలియజేసే ఒక ప్రత్యేక సంస్కృతి ఏర్పడింది. దీనిని "ఫ్లోరియోగ్రఫీ" అని పిలిచేవారు. ప్రతి పువ్వుకీ, ప్రతి రంగుకీ ప్రత్యేకమైన అర్థాన్ని కేటాయించి భావ వ్యక్తీకరణకు వినియోగించేవారు. ఈ నేపథ్యం ఆధునిక రోజ్ డే సంస్కృతికి పునాది వేసింది. కాలక్రమేణా ప్రపంచీకరణ ప్రభావంతో ఈ సంస్కృతి ప్రపంచ దేశాలకు వ్యాపించింది. ముఖ్యంగా పట్టణీకరణ, మీడియా ప్రభావం, యువత సంస్కృతిలో వచ్చిన మార్పులతో ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సామాజిక వేడుకగా రూపాంతరం చెందింది. గులాబీ పువ్వుల రంగులకు ఉన్న సంకేతార్థం ఈ దినోత్సవానికి ప్రత్యేకమైన భావ పరిమళాన్ని అందిస్తుంది. ఎరుపు గులాబీ గాఢమైన ప్రేమకు ప్రతీకగా నిలిస్తే, పసుపు గులాబీ స్నేహం, ఆనందం, ఆప్యాయతను సూచిస్తుంది. తెలుపు గులాబీ పవిత్రత, నిష్కపటతకు సంకేతం. పింక్ గులాబీ గౌరవం, కృతజ్ఞతను తెలియజేస్తుంది. నారింజ రంగు గులాబీ ఉత్సాహం, ఆశయాలను సూచిస్తుంది. ఇలా ప్రతి రంగు ఒక భావోద్వేగ భాషగా పనిచేస్తూ మానవ సంబంధాల వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక చిన్న పువ్వు ద్వారా సంక్లిష్టమైన భావాలను వ్యక్తపరచగల సామర్థ్యం ఈ సంస్కృతికి మూల బలం. సామాజిక కోణంలో గులాబీ దినోత్సవం యువతలో భావ వ్యక్తీకరణకు ఒక ముఖ్య వేదికగా మారింది. వేగవంతమైన జీవనశైలిలో మానవ సంబంధాలు యాంత్రికతకు లోనవుతున్న ఈ కాలంలో, ఒక చిన్న గుర్తింపుగా గులాబీ ఇవ్వడం ద్వారా మనసుల మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. కళాశాలలు, కార్యాలయాలు, సామాజిక వేదికల్లో ఈ రోజు పరస్పర గౌరవం, స్నేహాన్ని పంచుకునే సందర్భంగా మారింది. కుటుంబ సభ్యులకు, గురువులకు, సహచరులకు గులాబీ అందించడం ద్వారా కృతజ్ఞతను తెలియజేసే సంస్కృతి కూడా పెరుగుతోంది.

ఆర్థిక దృక్పథంలో చూస్తే గులాబీ దినోత్సవం పుష్ప పరిశ్రమకు ఒక కీలక కాలం. ప్రపంచవ్యాప్తంగా వాలెంటైన్స్ వారంలో పుష్పాల విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. భారతదేశంలో కూడా పుష్పోత్పత్తి, సరఫరా, రిటైల్ రంగాలకు ఇది అదనపు ఆదాయాన్ని తెస్తుంది. ఉద్యానవన రంగం, ఈ–కామర్స్ వేదికలు, గిఫ్ట్ పరిశ్రమ ఈ కాలంలో చురుకుదనాన్ని ప్రదర్శిస్తాయి. ఒక సాంస్కృతిక వేడుక ఆర్థిక కార్యకలాపాలను ఎలా ప్రభావితం చేస్తుందో దీనివల్ల స్పష్టమవుతుంది. అయితే ఈ దినోత్సవంపై విమర్శాత్మక దృక్కోణాలు కూడా ఉన్నాయి. కొందరు దీనిని పాశ్చాత్య వాణిజ్య సంస్కృతికి చెందినదిగా భావిస్తూ భావోద్వేగాల వాణిజ్యీకరణగా అభివర్ణిస్తారు. ప్రేమను ఒక నిర్దిష్ట రోజుకు పరిమితం చేయడం అవసరమా అనే ప్రశ్నలు కూడా లేవనెత్త బడుతున్నాయి. కానీ మరో కోణంలో చూస్తే, ఈ రోజు భావాలను గుర్తుచేసే ఒక ప్రతీక మాత్రమే; ప్రేమ, స్నేహం వంటి విలువలు నిత్యజీవితంలో కొనసాగాల్సినవే. గులాబీ దినోత్సవం ఆ విలువలను సంబరంగా గుర్తుచేసే ఒక సందర్భం.సాంస్కృతికంగా గులాబీ దినోత్సవం ఆధునిక భారత సమాజంలో ఒక ఆసక్తికర పరిణామాన్ని సూచిస్తుంది. సంప్రదాయ విలువలు, ఆధునిక భావ వ్యక్తీకరణ మధ్య సమతుల్యతను ఇది ప్రతిబింబిస్తుంది. భారతీయ సంస్కృతిలో పుష్పాలకు ఉన్న ఆధ్యాత్మిక, సాంప్రదాయ ప్రాధాన్యం ఆధునిక ప్రేమ సంస్కృతితో కలిసిపోతూ ఒక కొత్త సామాజిక రూపాన్ని సృష్టించింది. గులాబీ పువ్వు దేవాలయాల్లో పూజా పుష్పంగా ఉంటూనే, వ్యక్తిగత భావాల ప్రతీకగా కూడా నిలుస్తోంది.

సాహిత్యం, కళల్లో గులాబీ ప్రతీకాత్మక ప్రాధాన్యం విశేషమైనది. కవులు గులాబీని ప్రేమకు, సౌందర్యానికి, జీవితపు సున్నితత్వానికి రూపకంగా వర్ణించారు. గులాబీ సుగంధం మనసును పరవశింప జేసినట్లే, మంచి భావాలు మన సంబంధాలను పరిమళింప జేస్తాయని కవిత్వం సూచిస్తుంది. ఈ సాహిత్య పరంపర ఆధునిక గులాబీ దినోత్సవానికి భావాత్మక ు బలం అందిస్తుంది.మనోవిజ్ఞాన దృక్కోణంలో కూడా ఈ రోజు ప్రాముఖ్యత కలిగి ఉంది. భావాలను వ్యక్తపరచడం వ్యక్తిగత మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. కృతజ్ఞత, ప్రేమ, గౌరవం వంటి సానుకూల భావాలను వ్యక్తపరచడం సంబంధాలను బలపరచడమే కాకుండా వ్యక్తిలో సంతృప్తిని పెంచుతుంది. చిన్న గుర్తింపులు పెద్ద భావోద్వేగ అనుబంధాలను నిర్మిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మొత్తం మీద ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సాధారణ పండుగ దినం కంటే ఎక్కువ. ఇది భావోద్వేగాల సాంస్కృతిక ఉత్సవం, సంబంధాల పునరుద్ధరణకు ఒక గుర్తింపు, ప్రేమను వ్యక్తపరచే ఒక ప్రతీక. ఒక చిన్న గులాబీ పువ్వు మనసులోని మాటను ప్రపంచానికి తెలియజేసే శక్తిని కలిగి ఉందని ఈ రోజు గుర్తుచేస్తుంది. యాంత్రిక జీవనశైలిలో మనుషుల మధ్య అనుబంధాలను సజీవంగా ఉంచేందుకు ఇటువంటి సందర్భాలు అవసరమనే సందేశాన్ని గులాబీ దినోత్సవం అందిస్తుంది. ప్రేమను, స్నేహాన్ని, కృతజ్ఞతను పంచుకునే ప్రతి క్షణం విలువైనదని గుర్తుచేస్తూ, మనసులను దగ్గర చేసే సుగంధ సంస్కృతిగా ఇది నిలుస్తోంది.

## మేఘాలయ బొగ్గు గనిలో పేలుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** మేఘాలయలోని తూర్పు జైంటియా హిల్స్ జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక బొగ్గు గనిలో పేలుడు సంభవించి 18 మంది కార్మికులు మృతి చెందారు. ఈ గనిలో ఇంకా అనేకమంది కార్మికులు చిక్కుకుని ఉన్నారని అధికారులు అనుమానిస్తున్నారు. థాంగ్స్ ప్రాంతంలోని ఒక గనిలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ వికాష్ కుమార్ మీడియాకు తెలిపారు. పేలుడు సమాచారం తెలిసినవెంటనే పోలీసు బృందాలు అక్కడకు చేరుకున్నాయని, సహాయ చర్యలను ప్రారంభించాయని చెప్పారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సహాయం కూడా కోరామని తెలిపారు. జిల్లా అధికారులు ఇప్పటి వరకూ 16 మృతదేహాలను వెలికితీశారని చెప్పారు. బొగ్గు తవ్వకం కార్యకలాపాలు జరుగుతుండగా పేలుడు సంభవించిందని అనుమానిస్తున్నారు. పేలుడుకు గల కారణాలు ఇంకా వెల్లడికాలేదని, విచారణ జరుగుతోందని చెప్పారు. కాగా, పర్యావరణం, భద్రతా ప్రమాదాలు వంటి కారణాలతో మేఘాలయలో రాట్ హోల్ మైనింగ్, ఇతర అశాస్త్రీయ మైనింగ్‌ను ఎన్‌జిటి 2014లో రద్దు చేసింది. అయినా కూడా రాష్ట్రంలో ఇంకా రాట్ హోల్ మైనింగ్ కొనసాగుతోందని తాజా ప్రమాదం వెల్లడిస్తుంది.

## పంజాబ్‌లో కాల్పులు..

## ఆప్ నాయకుడు లక్కీ ఒబెరాయ్ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** పంజాబ్‌లో పట్టపగలే గన్ కల్చర్ మరోసారి కలకలం రేపింది. జలంధర్‌లోని అత్యంత రద్దీగా ఉండే మోడల్ టౌన్ ప్రాంతంలో ఆప్ నేత లక్కీ ఒబెరాయ్ దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం ఉదయం స్థానిక గురుద్వారా సాహిబ్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. తన కారులో కూర్చుని ఉన్న ఒబెరాయ్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు ఒక్కసారిగా తూటాల వర్షం కురిపించారు. దాదాపు ఐదు బుల్లెట్లు ఆయన శరీరంలోకి దూసుకెళ్లడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు విడిచారు. లక్కీ ఒబెరాయ్ ప్రతిరోజూ ఉదయం గురుద్వారాను సందర్శించడం ఆనవాయితీ. దుండగులు ఆయన దినచర్యను ముందే గమనించి, పక్కా ప్లాన్‌తో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయన కారు ఎక్కుతున్న సమయంలోనే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఒబెరాయ్ భార్య గతంలో 'ఆప్' తరఫున మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశారు. రాజకీయ కారణాలా? లేక పాత కక్షలా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లొంగిపోయిన 12మంది మావోయిస్టులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో గురువారం 12మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై రూ. 46లక్షల రివార్డు ఉన్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరోకి చెందిన ఎనిమిది మంది మహిళలు సహా 12మంది కేడర్ సభ్యులు ఇక్కడి సీనియర్ పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారని బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు మరియు కటేకళ్యాణ్ ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ సోమదు మడ్కం (42), వివిధ యూనిట్లకు చెందిన పార్టీ సభ్యులు హుంగి కుంజమ్(19), పయకి కుంజమ్(22)లకు ఒక్కొక్కరికి రూ.8లక్షల రివార్డు ప్రకటించారని అన్నారు. మరోముగ్గురు కేడర్లకు ఒక్కొక్కరికీ రూ.5లక్షలు, ఒక కేడర్‌కు రూ.2 లక్షలు, ఐదుగురు కేడర్లకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రివార్డు ప్రకటించారని చెప్పారు. ఎకె–47 రైఫిల్, రెండు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్, 250 జిలెటిన్ స్టిక్స్, 400డిటోనేటర్స్, గన్ పౌడర్ నింపిన ఒక ప్లాస్టిక్ డ్రమ్, కార్డెక్స్ వైర్ బండిల్‌ను అప్పగించారని ఆ అధికారి తెలిపారు.

# వెండి వెలవెల..! మళ్లీ భారీగా తగ్గిన రేటు



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం, వెండి ధరల పతనం సామాన్యులకు ఊరటనిస్తోంది. గత కొన్ని రోజులుగా అమాంత పెగిగిన ధరలు ఒక్కసారిగా దిగివస్తున్నాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు కిలో వెండి ధరపై ఏకంగా రూ.20,000 వేలు తగ్గింది. ఈ పరిణామం కిలో వెండి ధర రూ.2,80,000 వద్దకు చేరుకుంది. గత రెండు రోజుల్లోనే వెండి ధర ఏకంగా రూ. 40,000 మేర క్షీణించడం ఇన్వెస్టర్లను, కొనుగోలుదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిన్న కూడా కిలోపై రూ.20 వేల మేర తగ్గిన విషయం తెలిసిందే. మరోవైపు 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ.2,070 తగ్గి రూ.1,52,350 వద్ద ధర కొనసాగుతుండగా.. 22 క్యారెట్ బంగారంపై రూ.1,900 తగ్గి ధర 10 గ్రాములకు రూ.1,39,650గా ఉంది. ప్రపంచ మార్కెట్‌లో వెండి ధరలు గణనీయంగా తగ్గడం స్థానిక మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున వెండిని విక్రయించి లాభాలను స్వీకరిస్తున్నారు. అంతర్జాతీయంగా డాలర్ విలువ పెరగడం వల్ల బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ ధరల తగ్గింపు మధ్యతరగతి ప్రజలకు పెద్ద ఊరటనిస్తోంది. అయితే, అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ధరలు మరికొంత కాలం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సట్టా లాంటిదే ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫ్యూచర్స్ అండ్ అప్షన్స్ ట్రేడింగ్ అనేది ఒక రకమైన సట్టా వ్యాపారం లాంటిదేనని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అందుకే దీనిపై పన్ను పెంచాల్సి వచ్చిందన్నారు. అధిక రిస్క్ కలిగిన ఊహాజనిత వ్యాపారంగా భావించే ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్‌పై బడ్జెట్‌లో సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టిటి) పెంచిన విషయాన్ని తెలిసిందే. ఈ పన్ను పెంపును మంత్రి సమర్థించుకున్నారు. ఎఫ్‌అండ్‌ఒ ట్రేడింగ్ చేసే వారిలో దాదాపు 90 శాతం మంది నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కష్టార్జితం ఇలాంటి అధిక రిస్క్ ఉన్న లావాదేవీల్లో ఆవిరి కాకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇది ఓ రకమైన సట్టా వ్యాపారమని తెలిసినా.. ప్రభుత్వం గుర్తించినప్పటికీ దీనిని రద్దు చేయకుండా కొనసాగించడం గమనార్హం. రూపాయి పతనంపైనా మంత్రి స్పందించారు. మార్కెట్ శక్తులే రూపాయి విలువను నిర్ణయిస్తాయని తేల్చారు. తీవ్రమైన హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు మాత్రమే ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటుందన్నారు.

## ఎల్‌ఐసి ఫలితాలు ఆకర్షణీయం




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.12,930 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.11,008 కోట్ల లాభాలతో పోల్చితే 17 శాతం వృద్ధిని సాధించింది. క్రితం క్యూ3లో ఈ ప్రభుత్వ రంగ దిగ్గజం నికర ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ.1.26 లక్షల కోట్లకు చేరింది. 2024?25 ఇదే క్యూ3లో రూ.1.07 లక్షల కోట్ల ప్రీమియంను నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2025?26 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో ఎల్‌ఐసి మొత్తంగా 1,16,63,856 పాలసీలను విక్రయించగా.. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 1,17,10,505 పాలసీల అమ్మకాలను నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3,40,563 కోట్లుగా ఉన్న మొత్తం ప్రీమియం ఆదాయం.. 2025 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల్లో 9.02 శాతం పెరిగి రూ.3,71,293 కోట్లుగా చోటు చేసుకుంది. 2025 డిసెంబర్ ముగింపు నాటికి ఎల్‌ఐసి మొత్తం ఆస్తుల నిర్వహణ (ఎయుఎం) 8.01 శాతం పెరిగి రూ.59,16,680 కోట్లకు చేరింది. 2024 ఇదే సమయం నాటికి రూ.54,77,651 కోట్లుగా ఎయుఎం ఉంది. జీవిత బీమా మార్కెట్‌లో రెండు డజన్ల పైగా కంపెనీలున్నప్పటికీ బీమా వ్యాపారంలో ఎల్‌ఐసి ఇప్పటికీ 57.07 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది. 2024 డిసెంబర్ నాటి 57.42 శాతం వాటాతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. గురువారం బిఎస్‌ఇలో ఎల్‌ఐసి షేర్ 0.65 శాతం పెరిగి రూ.840.45 వద్ద ముగిసింది.

## బిట్‌కాయిన్ భారీ పతనం.. ఒక్కరోజే 12 శాతం కుదేలు

అంతర్జాతీయ క్రిప్టో కరెన్సీ మార్కెట్‌లో భారీ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన డిజిటల్ కరెన్సీ బిట్‌కాయిన్ విలువ ఒక్కసారిగా కుప్పకూలింది. కేవలం 24 గంటల వ్యవధిలోనే బిట్‌కాయిన్ ధర 12 శాతానికి పైగా పతనమై 63,295 డాలర్ల స్థాయికి చేరుకుంది. అయితే, గత రెండేళ్ల కాలంలో బిట్‌కాయిన్ ఒకే రోజులో ఈ స్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి. 2022 నవంబర్ తర్వాత నమోదైన అత్యధిక ఒక రోజు పతనం ఇదే కావడంతో మార్కెట్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. 2024 ప్రారంభం నుండి లాభాల బాటలో పయనించిన బిట్‌కాయిన్, ప్రస్తుతం అత్యంత బలహీనమైన దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితితో ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ఈ భారీ పతనం కారణంగా ప్రపంచవ్యాప్తంగా మదుపర్లు దాదాపు 1 బిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు రూ. 8,300 కోట్ల విలువైన బిట్‌కాయిన్ పొజిషన్లను వదిలించుకున్నారు. అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ భారీగా క్షీణించింది. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకుంటున్న నిర్ణయాలు, క్రిప్టో ఎక్స్ఛేంజీల నుంచి భారీగా నిధులు ఉపసంహరణే ఈ పతనానికి ప్రధాన కారణాలని తెలుస్తోంది. కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా, దీని ప్రభావంతో ఇథీరియం, సోలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు కూడా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఇన్వెస్టర్లు ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూడటం ఉత్తమమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# ఆర్బీఐ కీలక నిర్ణయం.. రెపో రేట్లు యథాతథం




బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఆవిర్భవించిన వేళ ఇవాళ జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి సమీక్ష సమావేశంలో గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ మేరకు ఆర్‌బీఐ రెపో రేటును 5.25 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించింది. ఇందులో ఎలాంటి మార్పు చేయబోమని స్పష్టం చేశారు. గత ఏడాది కాలంలో ఇప్పటికే 125 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించిన నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను బట్టి ఈసారి నిలిపివేయాలని కమిటీ నిర్ణయించింది. స్టాండర్డ్ డిపాజిట్ ఫెసిలిటీపై 5 శాతం, మార్జినల్ స్టాండిగ్ ఫెసిలిటీపై 5.50 శాతం, బ్యాంకు రేటుపై 5.50 శాతం, క్యాష్ రిజర్వ్ రేషియోపై వడ్డీ రేట్లు 3 శాతంగా ఉండనున్నట్లుగా వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం జీడీపీ వృద్ధి అంచనాను మునుపటి 6.8 శాతం నుంచి 7.4కి పెంచింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కోసం ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతం నుంచి 2 శాతాకి తగ్గించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం సానుకూల అంశమని ఎంపీసీ కమిటీ తెలిపింది. అదేవిధంగా మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచడానికి రూ.1 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలు చేపట్టనున్నట్లుగా ప్రకటించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందాల వల్ల భారత ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని, ఇది ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా వివరించారు. ఇక వార్షిక బడ్జెట్ సమావేశాల తర్వాత తర్వాత జరిగిన ఈ మొదటి సమీక్షలో వృద్ధిని ప్రోత్సహిస్తూనే ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేలా ఆర్‌బీఐ సమతుల్య నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతానికి హోమ్ లోన్, ఇతర రుణాల ఈఎంఐల్లో మార్పులు ఉండే అవకాశం లేదు.

# నెలల కనిష్టానికి రష్యా చమురు దిగుమతులు



గతేడాది డిసెంబర్‌లో రష్యా నుండి భారత్‌కు ముడి చమురు దిగుమతుల విలువ 38 నెలల కనిష్టానికి 2.7 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అదే సమయంలో 2024 డిసెంబర్ కంటే అమెరికా నుండి దిగుమతులు సుమారు 13శాతం పెరిగాయని తాజా నివేదిక తెలిపింది. భారతదేశ దిగుమతుల్లో రష్యన్ చమురు నాలుగో వంతు కంటే తక్కువగా ఉందని, ఇది గత నెల 34శాతం నుండి తగ్గిందని పేర్కొంది. భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని, బదులుగా భారత్ దిగుమతులపై టారిఫ్‌లను 50శాతం నుండి 18శాతానికి తగ్గించినట్లు గతవారం రోజుల నుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటిస్తున్న సమయంలో తాజా డేటా వెలువడింది. అయితే ఈ ప్రకటనను భారత ప్రభుత్వం ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదు. నిష్పాక్షిక మార్కెట్ పరిస్థితులకు మరియు అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా తన ఇంధనవనరులను మారుస్తున్నట్లు

విదేశాంగ శాఖ వాదిస్తోంది. డిసెంబర్ 2025లో 2.7బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ రష్యన్ చమురు దిగుమతులు, డిసెంబర్ 2024లో దిగుమతి చేసుకున్న మొత్తం కంటే 15శాతం తక్కువగా ఉన్నాయి. మరియు నవంబర్ 2025లో 3.7బిలియన్ డాలర్ల విలువైన దిగుమతుల కంటే 27.1శాతం తక్కువగా ఉన్నాయి. భారతదేశ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా డిసెంబర్ 2025లో 24.9శాతానికి పడిపోయింది. ఇది మూడు సంవత్సరాల్లో అత్యల్పం. పరిమాణంతో పోలిస్తే.. భారత్ 5.8 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకుంది. ఇది 2025 ఫిబ్రవరి తర్వాత అత్యల్పం. భారతదేశం డిసెంబర్ 2025లో అమెరికా నుండి 569.3 మిలియన్ల విలువైన చమురు దిగుమతి చేసుకుంది. ఇది నవంబర్ 2025లో దిగుమతి చేసుకున్న మొత్తం కంటే 60.5శాతం తక్కువగా ఉన్నప్పటికీ, నవంబర్‌లో అమెరికా నుండి చమురు దిగుమతులు ఏడు నెలల గరిష్టస్థాయికి పెరగడం కారణం. అమెరికా నుండి చమురు దిగుమతులు డిసెంబర్ 2024 కంటే సుమారు 31శాతం అధికం.

# రష్యా చమురు దిగుమతిని భారత్ పూర్తిగా నిలువరించలేదు



రష్యా నుండి చమురు దిగుమతిని భారత్ పూర్తిగా నిలువరించలేదని జాతీయ ఇంధన భద్రతా నిధిలో ప్రముఖ నిపుణుడు ఇగోర్ యుష్కోవ్ పేర్కొన్నారు. "అమెరికా ఎగుమతి చేసే ముడి చమురు గ్యాస్ కండెన్సెట్ మాదిరిగానే తేలికపాటి గ్రేడ్‌లను కలిగి ఉంటుంది. అదే సమయంలో రష్యా సల్ఫర్ అధికంగా ఉండే ఉరల్‌కి చెందిన చమురును సరఫరా చేస్తుంది. దీనర్థం భారతదేశం అమెరికా నుండి దిగుమతి అయ్యే ముడిచమురును ఇతర గ్రేడ్‌లతో కలపవలిసి వుంటుంది. దీనికోసం అధనంగా ఖర్చు చేయాల్సి వుంటుంది. అంటే సాధారణ ప్రత్యామ్నాయం సాధ్యం కాదు. దీంతో భారత శుద్ధి కర్మాగారాలు రష్యన్ ముడి చమురు దిగుమతిని పూర్తిగా నిలువరించలేవు" అని ఆయన పేర్కొన్నారు. "రష్యా భారత్‌కు రోజుకి 1.5మిలియన్ బ్యారెల్సనుండి 2మిలియన్ బ్యారెల్స్ వరకు సరఫరా చేస్తుంది. అయితే అమెరికా అంత మొత్తంలో సరఫరా చేయడం సాధ్యం కాదు. ట్రంప్ ఈ వాణిజ్య చర్చలలో తాను గెలిచానని మరియు ఒప్పందం పూర్తిగా అమెరికా డిమాండ్లకు అనుగుణంగా జరిగిందని చూపించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారనే భావన కలుగుతుంది" అని అన్నారు. చివరిసారిగా, 2022లో రష్యా యూరోపియన్ మరియు అమెరికన్ మార్కెట్ల నుండి భారత మార్కెట్‌కు మారినపుడు, అది రోజుకు 1మిలియన్ బ్యారెళ్ల ఉత్పత్తిని తగ్గించింది. దీని ఫలితంగా ధరలు బ్యారెల్‌కు 120డాలర్లకు పెరిగాయి. అమెరికా గ్యాసోలీన్ మరియు డీజిల్ ధరలకు జీవితకాల గరిష్ట ధర నిర్నయించిందని యుష్కోవ్ గుర్తుచేసుకున్నారు. ట్రంప్ ప్రకటనపై బుధవారం రష్యా ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మీడియాతో మాట్లాడారు. ఏ దేశం నుండైనా చమురును కొనుగోలు చేసే స్వేచ్ఛ భారత్‌కు ఉందని పేర్కొన్నారు. భారతదేశానికి చమురు మరియు ఇతర పెట్రోలియం ఉత్పత్తులను రష్యా మాత్రమే సరఫరా చేయదని తమకు, అలాగే ఇతర అంతర్జాతీయ ఇంధన నిపుణులకు తెలుసునని అన్నారు. ఈ ఉత్పత్తులను భారత్ ఇతర దేశాల నుండి కూడా కొనుగోలు చేస్తుందని, దీంతో ఈ ప్రకటన కొత్తగా ఏమీలేదని ఆయన తెలిపారు. చమురు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు భారత్ నుండి ఎటువంటి ప్రకటన రష్యాకు రాలేదని పెస్కోవ్ మంగళవారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# కుల వివక్షకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ప్రదర్శన




న్యూఢిల్లీ: విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహించిన ప్రదర్శనపై ఢిల్లీ పోలీసులు దాడికి దిగారు. విద్యార్థినుల సహా 100 మందికి పైగా విద్యార్థులను పోలీసులు ఈడ్చుకెళ్లారు. ఈ దాడిలో ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజి, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషే ఘోష్, అధ్యక్షుడు సూరజ్ ఇలామోన్, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎల్ అభిజిత్‌కు గాయాలు అయ్యాయి. ప్రదర్శనను రిపోర్టు చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై కూడా పోలీసులు దాడి చేశారు. విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కార్యాలయం వరకూ ఈ ప్రదర్శన నిర్వహించారు. కుల వివక్షను తొలగించడానికి జారీ చేసిన యుజిసి నిబంధనలను అమలు చేయాలని, రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ పోలీసు అధికారులకు లేఖ రాసింది. అయితే, ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించి మంత్రిత్వ శాఖ కార్యాలయం సమీపంలో భారీ బారికేడ్లతో భద్రతా ఏర్పాట్లు చేశారు. అక్కడికి చేరుకున్న విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడం ప్రారంభించారు. సమీపంలోని సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్ నుండి ఇతర పనుల నిమిత్తం వచ్చిన చాలా మందిని పోలీసులు వెనక్కి పంపారు. అయినా.. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో, వివిధ ప్రాంతాల నుండి వందలాది మంది విద్యార్థులు ప్లకార్డులతో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ ఉన్న పోలీసు బలగాలు విద్యార్థులపై దారుణంగా దాడి చేసి, వారిని రోడ్డుపై ఈడ్చికెళ్లి అరెస్టు చేసి అక్కడి నుండి తరలించారు. మోదీ ప్రభుత్వంలో నిరసన తెలిపే హక్కు , భావ ప్రకటనా స్వేచ్ఛను తిరస్కరించారని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు విమర్శించారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, దేశవ్యాప్తంగా విద్యార్థులకు న్యాయం, సమానత్వం లభించే వరకు తమ ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎక్సర్‌సైజ్ చేసినా బెల్లీ ఫ్యాట్ తగ్గట్లేదా



బెల్లీ ఫ్యాట్ చూడ్డానికి చిన్న ప్రాబ్లమ్‌లానే కనిపించే పెద్ద ప్రాబ్లమ్. దీనిని తగ్గించుకునేందుకు ఎక్కువగా ఎక్సర్‌సైజెస్, డైట్స్, ఇంటి చిట్కాలు ఫాలో అవుతుంటారు. అయినప్పటికీ త్వరగా రిజల్ట్ కనిపించదు. దీంతో నా బాడీ టైప్ ఇంత అని సరిపెట్టేసుకుంటారు. కానీ, అలా కాకుండా అసలు ఏం మిస్టేక్స్ చేస్తున్నామో గమనించాలి. ఎంత ట్రై చేసినా పొట్ట తగ్గట్లేదంటే కొన్ని తప్పులే కారణమని చెబుతున్నారు హోమియోపతి డాక్టర్ చందన. ఆమె ప్రకారం కొన్ని తప్పుల్ని అవాయిడ్ చేస్తే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతారట. మరి తప్పులేంటో చూడండి. బెల్లీ తగ్గాలంటే తినడం తగ్గించాలనుకోవడం సరికాదు. ముఖ్యంగా, రోజులో ముఖ్యమైన మీల్ బ్రేక్‌ఫాస్ట్‌ని అసలే స్కిప్ చేయొద్దు. ఇది ఎందుకు ముఖ్యమైన మీల్ అంటే రాత్రంతా దాదాపు 8 నుంచి 10 గంటల పాటు ఫాస్టింగ్ ఉన్న కడుపుకి బ్రేక్‌ఫాస్ట్ అనేది ఎనర్జీని ఇస్తుంది. దీనిని స్కిప్ చేసినా, లేట్‌గా చేసినా కూడా బెల్లీ తగ్గదు. తనలోని ఫ్యాట్‌ని అలానే ఉంచేస్తుంది. పైగా నీరసం, కోరికలు పెరిగి ఇంకా ఎక్కువగా తినాలనుకుంటారు. ఈ కారణం చేత లంచ్ టైమ్‌లోపు ఎక్కువగా జంక్‌ఫుడ్ తింటారు. అలా కాకుండా, చక్కగా ఉదయాన్నే మంచి హెల్దీ ముఖ్యంగా ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్ చేయండి. దీంతో చాలా వరకూ బాడీలోని ఫ్యాట్ కరుగుతుంది.

నీరు మంచిదే. కానీ, ఎప్పుడు తాగాలనేది తెలుసుకోవాలి. నీటిని మనం తినడానికి అరగంట ముందైనా, తర్వాతైనా తాగాలి. అంతేకానీ, తాగిన వెంటనే తినడం, తిన్న వెంటనే నీటిని తాగడం వంటివి చేయొద్దు. దీంతో జీర్ణ సమస్యలొస్తాయి. ఈ సమస్యలు ఉంటే ఆటోమేటిగ్గా గట్ ప్రాబ్లమ్స్ పెరిగి పొట్ట కూడా లావుగా కనిపిస్తుంది. కాబట్టి, అలా కాకుండా తిన్న తర్వాత గ్యాప్ ఇచ్చి నీటిని తీసుకోండి. కొంతమంది రోజంతా ఏదో ఒక ఫుడ్ తింటూనే ఉంటారు. అవి స్నాక్స్ అయినా, మరే ఫుడ్ అయినా అలా నోటిని ఆడిస్తూనే ఉంటారు. దీని వల్ల మీ గట్‌కి గ్యాప్ ఎక్కడ దొరుకుతుంది. ఎప్పుడైనా సరే కాసేపు కడుపుకి రెస్ట్ ఇవ్వండి. దీంతో చాలా వరకూ తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. హెల్దీగా ఉంటారు. అలా ఏది పడితే అది తినకుండా ఉండండి. బరువు, బెల్లీ తగ్గాలనుకున్నా, జీర్ణ సమస్యలు దూరమై గట్ హెల్త్ బాగుండాలన్నా, మంచి నిద్ర పట్టాలన్నా కూడా డిన్నర్‌ని ఎంత త్వరగా చేస్తే అంత మంచిది. అలా కాకుండా రాత్రుళ్లు లేట్ అయ్యే కొద్దీ మనకి మనంగానే ప్రాబ్లమ్స్‌ని తెచ్చుకున్నవారవుతాం. కాబట్టి, లేట్ నైట్ డిన్నర్ కాకుండా కనీసం 8 గంటల్లోపైనా డిన్నర్ కంప్లీట్ అవ్వాలి. తినడానికి నిద్రపోవడానికి కనీసం గంటన్నర నుంచి 2 గంటల గ్యాప్ ఉండేలా చూసుకోండి. అదే విధంగా, నిద్ర కూడా చాలా ముఖ్యం. రోజంతా అలసిన శరీరానికి, మనసుకి నిద్ర అనేది మంచి రిలాక్సేషన్ లాంటిది. మంచి నిద్ర ఉంటే బాడీ అలసిపోదు. మనసు కూడా తేలిగ్గా ఉంటుంది. కాబట్టి, హ్యాపీగా నిద్రపోండి. మంచి నిద్ర అంటే గ్యాప్ లేకుండా కనీసం 7 గంటలైనా నిద్రపోవడం. ఆల్కహాల్ అలవాటు అకేషనల్లీ అయితే పర్లేదు. కానీ, రెగ్యులర్‌గా ఆల్కహాల్ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యల దగ్గర్నుంచీ ఇతర సమస్యలు కూడా వస్తాయి. డీహైడ్రేట్ అవుతారు. నిద్ర సమస్యలొస్తాయి. ఇది మన శరీర పనితీరుని నెమ్మదిస్తుంది. కాబట్టి, ఎప్పుడు కూడా అలా చేయకండి. ఏదైనా పార్టీ ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. ఇలాంటి తప్పులన్నీ అవాయిడ్ చేసి మంచి డైట్, లైఫ్‌స్టైల్ ఫాలో అయితే చాలా వరకూ బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. అంతేకానీ, నా శరీరమే ఇంత కాస్తా తిన్నా బాడీ పెరుగుతుందనుకుని మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకోవద్దు.

# నిద్ర కరువైతే నీలివేణికి ముప్పే



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిద్రలేమి. సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల కేవలం అలసట మాత్రమే కాదు, శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా మనం గాఢ నిద్రలో లేనప్పుడు శరీరంలో కార్టిసోల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు అసాధారణంగా పెరుగుతాయి. ఈ హార్మోన్ హెచ్చుతగ్గులు నేరుగా మన జుట్టు ఆరోగ్యంపై పడి, ఊహించని విధంగా జుట్టు రాలడానికి దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో పెరిగిన కార్టిసోల్ ప్రభావం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడతాయి. సాధారణంగా జుట్టు కుదుళ్లకు అందాల్సిన రక్త ప్రసరణ ఈ హార్మోన్ వల్ల తగ్గిపోతుంది. దీనివల్ల కుదుళ్లకు అవసరమైన ఆక్సిజన్ మరియు పోషకాలు సరైన మోతాదులో అందవు. ఫలితంగా, బలంగా ఉండాల్సిన వెంట్రుకలు క్రమంగా బలహీనపడి, చిన్నపాటి ఒత్తిడికి కూడా రాలిపోయే స్థితికి చేరుకుంటాయి. అసంపూర్తి నిద్ర కేవలం జుట్టు రాలడానికే పరిమితం కాకుండా, తల చర్మం ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరంలోని సహజ మరమ్మత్తు ప్రక్రియ ఆగిపోతుంది, దీనివల్ల తల చర్మం పొడిబారడం లేదా ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. చర్మం ఆరోగ్యంగా లేనప్పుడు కొత్త జుట్టు మొలవడం ఆగిపోవడమే కాకుండా, ఉన్న జుట్టు తన సహజ మెరుపును కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. అందుకే అందమైన మరియు ఒత్తైన జుట్టు కావాలనుకునే వారు కేవలం షాంపూలు, నూనెలపైనే కాకుండా సరైన నిద్రపై కూడా దృష్టి సారించాలి. ప్రతిరోజూ కనీసం 7 నుండి 8 గంటల గాఢ నిద్రను పొందడం వల్ల కార్టిసోల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా జుట్టు కుదుళ్లకు పోషణ అంది, జుట్టు రాలడం తగ్గి ఆరోగ్యంగా పెరుగుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి మాత్రమే మీ జుట్టును దీర్ఘకాలం పాటు సంరక్షించగలదు.

# పసుపు పాలు తాగుతున్నారా?



ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు. కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

## రక్తహీనతను తరిమి కొట్టే సజ్జల లడ్డూ



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. అందుకే ఆరోగ్యంగా ఉండాలి అంటే తప్పకుండా మంచి ఆహారం తీసుకోవాలి. అయితే ఈ మధ్యకాలంలో చాలా మంది రక్తహీనత, ఎముకల బలహీనతతో బాధపడుతున్నారు. అలాంటి వారు మంచి ఐరన్, ఫైబర్ ఉండే సజ్జల లడ్డు రోజుకు ఒకటి తిన్నారంటే, ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారు. మరి దీనిని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

కావాల్సిన పదార్థాలు : సజ్జలు అర కిలో, బెల్లం 500 గ్రాములు, నెయ్యి 10 టీస్పూన్స్, తెల్ల నువ్వులు, వేరుశనగలు 100 గ్రాములు, బాదం 75 గ్రాములు, ఎండు ద్రాక్ష 25 గ్రాములు, ఏలకుల పొడి వన్ టీ స్పూన్, శొంఠి పొడి పావు టీస్పూన్, ఉప్పు చిటికెడు.

తయారీ విధానం : ముందుగా స్టవ్ వెలిగించి, దానిపై పాన్ పెట్టుకొని సజ్జలను వేయించుకోవాలి. అవి వేగిన తర్వాత పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు సజ్జల పిండి రెడీ అయిపోయింది.

ఇప్పుడు మరో పాన్ తీసుకొని అందులో కొంచె నెయ్యి వేసి, తెల్ల నువ్వులు, వేరుశనగ పప్పులు, బాదం, ఎండు ద్రాక్ష వేసి దోరగా వేయించుకోవాలి. తర్వాత వీటిని పక్కన పెట్టి, అదే పాన్‌లో మరో టీ స్పూన్ నెయ్యి వేసి, మనం మిక్సీ పట్టుకున్న పిండిని దోర దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు వేయించిన నువ్వులు, పల్లీలు, బాదం అన్నింటినీ మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఈ పొడిని పక్కన పెట్టుకొని, ఒక పెద్ద బౌల్ తీసి, అందులో మనం వేయించి పక్కన పెట్టుకున్న సజ్జల పిండిని, మిక్సీ పట్టిన వేరుశనగ, నువ్వుల మిశ్రమాన్ని వేసి, కొంచెం ఉప్పు వేసి, మంచిగా కలుపుకోవాలి.

ఇప్పుడు బెల్లం పాకం ప్రిపేర్ చేసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి, అందులో అర కప్పు నీళ్లు పోసి, అవి మరిగిన తర్వాత బెల్లం వేసి, పాకం వచ్చే వరకు మరిగించుకోవాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, కొంచెం చల్లారిన తర్వాత అందులో సజ్జల పిండిని వేసి మంచిగా ఉండలు లేకుండా కలుపుకోవాలి.దీని తర్వాత చేతికి నెయ్యిని రాసుకొని, సజ్జల పిండిని చిన్నగా లడ్డూల మాదిరి చుట్టకోవాలి. అంతే ఆరోగ్యాన్ని ఇచ్చే టేస్టీ టేస్టీ సజ్జల లడ్డూలు రెడీ. మరి మీరు కూడా మీ ఇంటిలో ప్రిపేర్ చేయండి

## కాలిఫ్లవర్ వండేటప్పుడు ఈ తప్పులు అస్సలు చేయకండి!



కాలిఫ్లవర్ ను ఎలా పడితే అలా వండితే అనారోగ్య సమస్యలు వస్తాయి. వీటిని ఉడికించి తినకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయి. అలాగే, టేస్ట్ కూడా మారుతుంది. కాలిఫ్లవర్ ను కుక్ చేసేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. మనం రోజూ వండుకునే కాయ కూరగాయల్లో కాలిఫ్లవర్ కూడా ఒకటి. దీనిని కొంతమంది గోబీ అంటారు. ఇంకా దీనితో కర్రీ, పచ్చడి, ఫ్రై, పకోడి లాంటి వైరైటీలు చేసుకుని తింటాము. అయితే, కాలిఫ్లవర్ తో ఏం చేసుకుని చాలా బావుంటుంది. అంతేకాదు, కాలిఫ్లవర్ మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. అయితే కాలిఫ్లవర్ కుక్ చేసేటప్పుడు ఈ తప్పులు చేయొద్దని నిపుణులు చెబుతున్నారు. ముందుగా కాలిఫ్లవర్ ను తీసుకుని పాన్ లో వేసేస్తారు. ఇలా చెయ్యకూడదు. దీని వలన రుచి మొత్తం పోతుంది. అలా కాకుండా, కాలిఫ్లవర్ ను తీసుకుని శుభ్ర పరిచి ఆరబెట్టి ఆ తర్వాత వండాలి. ఇక కొందరు మధ్యలోనే ఉప్పు వేస్తుంటారు. అయితే, ఇది అంత మంచి పద్ధతి కాదని అంటున్నారు. కూర త్వరగా అవ్వాలని ముందు ఉప్పు వేసి కాలిఫ్లవర్ ను మగ్గించేస్తారు. ఇలా అస్సలు చేయకండి. చివర్లో ఉప్పు వేస్తే కూర కూడా మంచిగా ఉంటుంది. వంట చేసే 10 నిముషాల పాటు దీనిలో నీటిలో ఉంచాలి. కొందరు, పాన్ వేడి అవ్వకముందే కాలిఫ్లవర్ ను వేసేస్తారు. ఇలాంటి తప్పులను అస్సలు చేయకండి.

## వజ్ర దంతి విలువ తెలిస్తే షాక్ అవుతారు!



పల్లెటూరి వాతావరణం అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. ఇక పొలం గట్లు, పచ్చని చెట్లు, పక్షుల కిల కిలలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి. ఇక గ్రామీణ ప్రాంతంలో చాలా మొక్కలు దర్శనం ఇస్తుంటాయి. అందులో అనేక రకాల మొక్కలు ఉంటాయి. అయితే చాలా మంది వాటిని పిచ్చి మొక్కలు అనుకుంటారు. కానీ అందులో కొన్ని మొక్కలు అనేక ప్రయోజనాలు ఉన్నాయంట. అందులో ఒకటి వజ్ర దంతి. ఈ మొక్కలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. పసుపు రంగు పూలలో, ముళ్లతో ఉండే వ్రజ దంతి మొక్కలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయంట. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. వజ్ర దంతి, దంత సమస్యలకు చాలా మంచిది. ఈ మూలికను ఆయుర్వేదంలో నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ, చిగుళ్ల బలోపేతానికి ఉపయోగిస్తుంటారు. అంతే కాకుండా నోటి పూతను తగ్గించడంలో కూడా ఇది కీలకంగా పని చేస్తుంది. ఇది గ్రామీణ ప్రాంతంలో చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పటికీ చాలా మంది చిగుళ్ల సమస్యకు ఈ మూలికను ఉపయోగిస్తుంటారు. ఇక ఈ వజ్ర దంతి మూలికలో అనేక యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయంట. అందువలన దీనిని పిప్పి పన్ను సమస్యతో బాధపడే వారు, ఈ ఆకు రసాన్ని పిప్పి పన్ను వద్ద పోయడం వలన ఇది ఆ సమస్య నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుందంట. అంతే కాకుండా , దీని ఆకులు నమలడం వలన చిగుళ్ల సమస్యలు వెంటనే తగ్గిపోతాయంట. చాలా మంది ఈ మొక్క కేవలం దంత సమస్యలకే దివ్యౌషధం అనుకుంటారు. కానీ ఇది అనేక సమస్యలను తరిమికొట్టే ఆయుధంగా పని చేస్తుందంట. ఈ మొక్క పూలు, ఆకులు, వేర్లు, అన్నింటిలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయంట. ముఖ్యంగా ఎవరు అయితే కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారో, వారు ఈ ఆకుల రసాన్ని నొప్పుల చోట రాయడం వలన కీళ్ల నొప్పులు తగ్గుతాయంట. అదే విధంగా చర్మం, దగ్గు, ఉబ్బసం వంటి శ్వాస సమస్యలతో బాధపడే వారు, దీనిని తీసుకోవడం చాలా మంచిదంట. అలాగే రోగనిరోధక శక్తిని పెంచి, కాలేయ పనితీరును మెరుగు పరచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందంట. అందుకే చాలా మంది దీనిని ఉపయోగిస్తుంటారు.

## వీపుపై మొటిమలు దుస్తులు, ఆహారం, ఒత్తిడితో జాగ్రత్త!



వీపు మీద గుల్లలు లేదా మొటిమల సమస్య చాలా మందికి ఉంటుంది. వ్యాయామం తర్వాత, చెమట పట్టిన వెంటనే దుస్తులు మార్చాలని, చర్మం గాలి ఆడే కాటన్ దుస్తులు ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు. బిగుతుగా ఉండే సింథటిక్ దుస్తులు రాపిడితో మొటిమలను తీవ్రతరం చేస్తాయని తెలిపారు. చక్కెర, వేయించిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండి, తాజా పండ్లు, కూరగాయలు తినాలని, పుష్కలంగా నీరు తాగాలని సూచించారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలని, రోజుకు 7-8 గంటలు నిద్రపోవడం ముఖ్యమని తెలిపారు.టీట్రీ ఆయిల్ వివిధ రకాల చర్మ సమస్యల్ని దూరం చేస్తుంది. కాబట్టి ఈ నూనెతో తరచూ వీపును మర్దన చేసుకోవడం మంచిది. అలాగే టీట్రీ ఆయిల్ వాడి తయారుచేసిన లోషన్లు, క్లెన్సర్లు, క్రీమ్స్ ఉపయోగించినా ఫలితం ఉంటుంది. సన్‌స్క్రీన్ వీపుకీ అవసరమే. ఎందుకంటే దుమ్ము, కాలుష్యం కారణంగా మూసుకుపోయిన చర్మ రంధ్రాలు తెరుచుకునేందుకు ఇది సహాయపడుతుంది. ఫలితంగా అక్కడి చర్మ కణాలు శుభ్రపడి మొటిమల సమస్య వేధించదు. అయితే నూనె రహిత సన్‌స్క్రీన్ లోషన్లు ఎంచుకోవాల్సి ఉంటుంది.

# టీ20 ప్రపంచకప్ 2026.. అందరి కళ్లూ ఈ 10 మంది ఆటగాళ్లపైనే!

**రేపటి నుంచి టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం**

**భారత్, శ్రీలంక సంయుక్తంగా అందిస్తున్న ఆతిథ్యం**

**భారత్‌లో బ్యాటింగ్, లంకలో స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లు**

**టోర్నీ ఫలితాన్ని శాసించగల 10 మంది కీలక ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి**



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026కు రంగం సిద్ధమైంది. రేపటి నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో ఈ మెగా టోర్నీ షురూ కానుంది. ఈసారి ప్రపంచకప్ వ్యూహాత్మకంగా ఎంతో భిన్నంగా ఉండనుంది. ఒకవైపు భారత్‌లోని బ్యాటింగ్ స్వర్గధామాలపై పరుగుల వరద పారే అవకాశం ఉండగా, మరోవైపు శ్రీలంకలోని నెమ్మదైన పిచ్‌లు స్పిన్నర్లకు, ఓపికతో ఆడే బ్యాటర్లకు పరీక్ష పెట్టనున్నాయి. ఈ పొట్టి ఫార్మాట్‌లో పవర్‌ప్లేలో చెలరేగడం, మిడిల్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయడం, డెత్ ఓవర్లలో ఒత్తిడిని జయించడం వంటి కీలకమైన లక్షణాలే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశిస్తాయి. గతాన్ని చూస్తే, కొద్దిమంది ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలే టోర్నమెంట్ గమనాన్ని మార్చేశాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రపంచకప్‌లో తమదైన ముద్ర వేయగల 10 మంది ఆటగాళ్లపై ఓ లుక్ వేద్దాం.

**భారత ఆటగాళ్లు:**

టీమిండియా దూకుడుకు నిదర్శనం అభిషేక్ శర్మ. పవర్‌ప్లేను అవకాశంగా మలచుకుని బౌలర్లపై విరుచుకుపడతాడు.

ఇక, బిగ్ టోర్నీ స్పెషలిస్ట్ హార్దిక్ పాండ్యా ఒత్తిడిలో రాణించగల సామర్థ్యంతో జట్టుకు సంపూర్ణ సమతుల్యం అందిస్తాడు.

ఒకప్పుడు మిస్టరీ స్పిన్నర్‌గా పేరు తెచ్చుకున్న వరుణ్ చక్రవర్తి, ఇప్పుడు నియంత్రణ, వ్యూహంతో పవర్‌ప్లేలోనే వికెట్లు తీయగలడు.

బ్యాటర్ల ఆధిపత్యం నడిచే ఈ ఫార్మాట్‌లోనూ తన యార్కర్లు, వైవిధ్యమైన బంతులతో మ్యాచ్‌ను శాసించగల బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.

**అంతర్జాతీయ స్టార్లు:**

ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తన దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి వ్యూహాలను చిన్నాభిన్నం చేయగలడు.

శ్రీలంక పిచ్‌లపై ఆ జట్టు స్పిన్ సంచలనం వనిందు హసరంగ అత్యంత ప్రమాదకారి. కీలక సమయాల్లో వికెట్లు తీయడమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు.

దక్షిణాఫ్రికాకు క్వింటన్ డి కాక్ తన సొగసైన ఆటతో పవర్‌ప్లేలో ఆధిపత్యం చెలాయిస్తాడు.

ఇంగ్లండ్ దూకుడుకు ప్రతిరూపం ఫిల్ సాల్ట్.

ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెన్నెముక కాగా, ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్, పేస్ బౌలింగ్‌తో జట్టుకు కీలకం కానున్నాడు.

మొత్తం మీద ఈ ప్రపంచకప్ శక్తికి, యుక్తికి మధ్య జరిగే పోరుగా నిలవనుంది. మార్చి 8 వరకు జరిగే ఈ టోర్నీలో ఏ జట్టు విజేతగా నిలుస్తుందో తెలియాలంటే, ఈ కీలక ఆటగాళ్ల ప్రదర్శనపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఒక్క ఓవర్ ఆటను మార్చే ఈ ఫార్మాట్‌లో వీరి ప్రదర్శన కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ బద్దలుకొట్టిన రికార్డ్స్ ఇవే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్, ఇండియా మధ్య జరుగుతున్న అండర్ 19 వరల్డ్ కప్ మ్యాచ్ యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చెలరేగాడు. 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సులతో 175 రన్స్ బాదాడు ఈ చిచ్చరపిడుగు. క్రీస్ లో అడుగు పెట్టినప్పటి నుంచి బ్యాట్ తో విజృంభించాడు సూర్యవంశీ. సూర్యవంశీ స్పీడ్ కి ఇంగ్లాండ్ బౌలర్లు ఏమాత్రం బ్రేకులు వేయలేకపోయారు.

కేవలం 55 బంతుల్లోనే సెంచరీ చేసిన సూర్యవంశీ.. అతితక్కువ బంతుల్లో సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. అండర్ 19 వరల్డ్ కప్ లో సెంచరీ చేసిన మూడో ఇండియన్ ప్లేయర్ గా నిలిచాడు సూర్యవంశీ. గతంలో మంజోత్ కాల్రా, ఉన్ముక్త్ చంద్ ఈ ఘనత సాధించగా.. వారికంటే తక్కువ బంతుల్లో సెంచరీ సాధించిన ప్లేయర్ గా రికార్డ్ సాధించాడు సూర్యవంశీ.

**సూర్యవంశీ బద్దలుకొట్టిన రికార్డులు ఇవే:**

అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్స్ లో అత్యధిక స్కోర్ ( 175 )

అండర్ 19 వన్డే చరిత్రలో 100 సిక్సర్లు పూర్తి చేసిన ఫస్ట్ ప్లేయర్

అత్యంత చిన్న వయసులో అండర్ 19 వరల్డ్ కప్ లో సెంచరీ

అండర్ 19 వరల్డ్ కప్ లో అత్యంత వేగవంతమైన సెంచరీ

ఫైనల్ మ్యాచ్ లో అత్యధిక సిక్సులు

అండర్ 19 వరల్డ్ కప్ ఒకే సీజన్లో అత్యధిక సిక్సర్లు.

# అనుకున్నదే జరిగింది.. ఇంగ్లండ్ ఓపెనర్ మళ్లీ ఫెయిల్.. అంబ్రీష్ బౌలింగ్‌శ్రీలో బౌల్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అనుకున్నదే జరిగింది. 412 పరుగుల భారీ టార్గెట్ ఛేజింగ్‌శ్రీలో ఇంగ్లండ్ ఆదిలోనే తడబడింది. తొలి రెండు ఓవర్లు టీమిండియా బౌలర్లు ఒక్క పరుగు రానివ్వకుండా కట్టడి చేశారు. ఆ తర్వాత.. ఇంగ్లండ్ ఓపెనర్ జోసెఫ్ మూర్స్ నాలుగు ఫోర్లతో చెలరేగి స్పీడ్ పెంచినప్పటికీ ఆ జోరు కాసేపటికే ఆవిరైపోయింది. టీమిండియా బౌలర్ ఆర్ఎస్ అంబ్రీష్ బౌలింగ్‌ఎలో క్లీన్ బౌల్డ్ కావడంతో ఇంగ్లండ్ ఓపెనర్ మూర్స్ 16 బంతుల్లో 17 పరుగులు చేసి నిరాశగా వెనుదిరిగాడు. బంగ్లాదేశ్‌ఎతో మ్యాచ్ దగ్గర నుంచి మూర్స్ ఫామ్ కోల్పోయాడు. బంగ్లాతో ఈ మ్యాచ్‌ఎలో ఇంగ్లండ్ గెలిచినప్పటికీ మూర్స్ ఆరు బంతుల్లో ఒక్క పరుగు చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత న్యూజిలాండ్ మ్యాచ్‌ఎలో 40 బంతుల్లో 20 పరుగులు, ఆస్ట్రేలియా మ్యాచ్‌శ్రీలో 33 బంతుల్లో 25 పరుగులు, కీలకమైన ఫైనల్ మ్యాచ్‌ఎలో 16 బంతుల్లో 17 పరుగులు. ఇలా ఈ ఇంగ్లండ్ ఓపెనర్ ఫామ్ కోల్పోవడం.. టీమిండియా 412 పరుగుల టార్గెట్ పెట్టడంతో ఇంగ్లండ్ బ్యాటర్లపై తీవ్రంగా ఒత్తిడి ఉంది.

ఇక.. మరో ఓపెనర్ బెన్ డాకిన్స్ కూడా చేతులెత్తేస్తే ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌ఎలో గెలవడం దాదాపు కష్టమే. ఎనిమిది ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ జట్టు ఒక వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. బెన్ డాకిన్స్ 21 బంతుల్లో 25 పరుగులు, బెన్ మేయెస్ ఏడు బంతుల్లో రెండు పరుగులు చేసి క్రీజులో ఉన్నారు.



**దివి రెడ్ చీరలో అందరి దృష్టిని ఆకర్షించింది**

# యష్ ‘టాక్సిక్‘.. తెలుగు టార్గెట్ రీచ్ అవుతుందా?



స్టార్ హీరో యష్.. ఇప్పుడు టాక్సిక్ మూవీతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ చిత్రానికి గీతూ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. సమ్మర్ కానుకగా మార్చి 19వ తేదీన సినిమా వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుండగా.. ఇప్పటికే ఆ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు మేకర్స్. వరుస ప్రమోషనల్ కంటెంట్ ను రిలీజ్ చేసేందుకు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. వాటిని మరింత పెంచేలా ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే పాన్ ఇండియా వైడ్ గా సినిమా రిలీజ్ కానుండగా.. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన థియేట్రికల్ హక్కులను పీవీఆర్‌– ఐనాక్స్ సొంతం చేసుకుంది. ఇప్పటికే ఆ విషయాన్ని అనౌన్స్ చేసింది. అయితే సుమారు రూ.40 కోట్ల అడ్వాన్స్ కు తెలుగు స్టేట్స్ రైట్స్ ను పీవీఆర్‌– ఐనాక్స్ దక్కించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో యష్ కెరీర్ లోనే కాకుండా తెలుగులో కన్నడ హీరోలకు సంబంధించిన సినిమాల్లో టాక్సిక్ టాప్ డీల్ అని తెలుస్తోంది. కేజీఎఫ్ సిరీస్ చిత్రాల విజయాల తర్వాత యష్ మార్కెట్ రేంజ్ పెరిగిన విషయం తెలిసిందే.

ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కేజీఎఫ్ 2 బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టి నిర్మాతలకు లాభాల వర్షం కురిపించింది. రూ.79 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలో దిగిన ఆ మూవీ.. కంప్లీట్ రన్ లో రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇప్పుడు అదే నమ్మకంతోనే టాక్సిక్ పై పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినట్లు అర్థమవుతుంది. అయితే దానికి తగ్గట్లే సినిమా వసూళ్లు సాధించాలి. టాక్సిక్ బ్రేక్ ఈవెన్ కావాలంటే కనీసం కేజీఎఫ్ ఛాప్టర్ 2 ఫైనల్ కలెక్షన్లలో సగం వసూలు చేయాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేసినట్లు తెలుస్తోంది. అంటే రూ.70 కోట్లకుపైగా వసూలు చేయాలన్నమాట. అదే జరగాలి అంటే.. సినిమాకు మంచి పాజిటివ్ టాక్ రావాలి.. కంటెంట్ అదిరిపోయేలా ఉండాలి. అప్పుడు ఆ నెంబర్ ను సొంతం చేసుకునే ఛాన్స్ ఉంటుంది. అదే సమయంలో బడా సినిమాల థియేట్రికల్ హక్కులను కార్పొరేట్ సంస్థలు సొంతం చేసుకోవడం ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఒక ట్రెండ్ గా మారింది. అలా టాక్సిక్ మూవీని పీవీఆర్‌– ఐనాక్స్ డిస్ట్రిబ్యూట్ చేయడం వల్ల రిలీజ్ మరింత గ్రాండ్ గా ఉండేలా కనిపిస్తుంది. స్క్రీన్ కౌంట్ కూడా భారీగా పెరిగే ఛాన్స్ ఉంది. దీంతో ఇప్పుడు టాక్సిక్ మూవీ.. తెలుగులో ఎలాంటి హిట్ అవుతుందో.. ఎంతటి వసూళ్లు సాధిస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇక సినిమా విషయానికొస్తే.. భారీ బడ్జెట్ తో స్టైలిష్ యాక్షన్ డ్రామాగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె నారాయణ, యష్ సంయుక్తంగా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మూవీలో యష్‌తో పాటు అందాల భామలు కియారా అద్వానీ, హుమా ఖురేషీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు.



**సిమ్రాన్ చౌదరి నేచురల్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965